హోటల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



పట్టణ కేంద్రంలోని నేషనల్ హైవే నెంబర్-65లో నూతనంగా ఏర్పాటు చేసిన అక్షర పార్క్ హోటల్‌ను ఆదివారం నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. హోటల్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుచిశుభ్రతతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని వినియోగదారులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోటల్ నిర్వాహకులు పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

నల్లగొండ

సోమవారం | మార్చి 10, 2025 | www.navatelangana.com

జిమ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎస్పీ

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



పట్టణ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల కాంప్లెక్స్‌లో ఆదివారం ఎస్పీ శరత్ చంద్రపవార్ ది హల్క్ ఫిట్నెస్ జిమ్ సెంటర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటియాంత్రిక జీవనంలో మనిషి మానసికఒత్తిడి నుండి బయటపడి ఆరోగ్యకరమైన జీవితం గడపడానికి కొంత సమయం వ్యాయామానికి కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి జిమ్ సెంటర్లను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిమ్ సెంటర్ నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

బత్తాయి తోటల నిర్వహణలో రైతులు ఎదుర్కొనే సమస్యలపై చైతన్య కార్యక్రమం

నవతెలంగాణ-క్లాక్‌టవర్

పట్టణంలో మునుగోడు క్రాస్ రోడ్డు సందీప్ స్కూలులో ఏర్పాటుచేసిన బత్తాయి, నిమ్మ తోటల నిర్వహణలో రైతులు ఎదుర్కునే సమస్యలపై తెగుళ్ల, నివారణ, నియంత్రణ చర్యలు చైతన్య కార్యక్రమం నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నల్గొండ మాజీ శాసనసభ్యులు నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి నల్గొండ జిల్లా బత్తాయి దిగుబడులో ప్రథమ స్థానంలో ఉందన్నారు.నేటి రోజులలో పెరుగుతున్న ధరలు అనుగుణంగా ఆశించిన దిగుబడి రాక బత్తాయి రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం కూడా అంగన్వాడీలో, ప్రభుత్వ పాఠశాలలో, గురుకులాలలో, బత్తాయి జ్యూస్‌ను పౌష్టికారంగా ఇవ్వాలని, ప్రభుత్వమే బత్తాయి రైతులను ఆదుకోవాలని కోరారు.ఏ విధంగా అయితే రోజు ఒక గుడ్డు తింటే పౌష్టికారంగా ఉంటామో అదేవిధంగా ఆహార పట్టికలో బత్తాయి జ్యూస్ పెట్టాలని గుర్తు చేశారు. బత్తాయి రైతులందరూ సంఘటితం కావాలని, సంఘం ఏర్పాటు



చేసుకోవడానికి సహాయ సహకారాలు అందజేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం హార్టి కల్చర్ అధికారులు కొంపల్లి మురళి, భూక్యా రవి, రావుల విద్యాసాగర్, మాట్లాడారు.బత్తాయి రైతులకు మొక్కల ఎంపిక విధానం నీటి సౌకర్యం,వివిధ వ్యాధులు చీడపురుగుల బెడద, కాయ నాణ్యతను, దిగుబడి పెంచే విధానాన్ని వాతావరణ పరిస్థితుల కారణంగా వివిధ వ్యాధులు వస్తున్నాయన్నారు.సకాలంలో అరికట్టడంతో నాణ్యమైన దిగుబడిని పెంచవచ్చు లేదంటే ఏడాది పంట నష్టపోవచ్చు పెట్టుబడులు సైతం చేతికి రావన్నారు. బత్తాయి, నిమ్మకు ఆకుముడత, నల్లిపురుగు, గొంగళి పురుగు, పేనుబంక. వ్యాధులను గమనించాలని సకాలంలో రసాయనాలను పిచికారి చేసినట్లయితే వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. తెగుళ్ల బంక తెగుళ్ళ, వేరుకుళ్ళు తెగుళ్ల, గజ్జి తెగులు కూడా బత్తాయి రైతులు హార్టికల్చర్ అధికారుల సూచనల మేరకు సరైన సమయంలో వ్యాధుల నివారణ చర్యలను అరికట్టవచ్చన్నారు. పంట దిగుబడిని పెంచొచ్చని తెలిపారు. సేంద్రీయ ఏరువులను,కంపోస్ట్ ఎరువులను, మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని,తర్వాతే రసాయన ఎరువులను వాడాలని ప్రొపినోపాజ్, తయోమితాక్షం మొదలగు వాటిని వాడి తెగుళ్ల నివారించవచ్చని, సూచించారు. ఈ కార్యక్రమంలో బత్తాయి, నిమ్మ రైతులు తదితరులు పాల్గొన్నారు



నేడు ప్రణయ్ హత్య కేసు తీర్పు

నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ కుల దురంకార హత్యకేసు తీర్పు నేడు వెలువడనుంది. సుమారు 6 సంవత్సరాలు కాలం తర్వాత విచారణ పూర్తి చేసుకుంది. బుధవారం వాదనలు పూర్తి చేసుకోగా సోమవారం రెండవ అదనపు సెషన్స్ కోర్టు అండ్ ఎస్సీ ఎస్టీ కోర్టు తీర్పు వెల్లడించనున్నారు. తన కూతురిని కులాంతర వివాహం చేసుకున్నాడనే కక్షతో సుఫారీ గ్యాంగ్‌తో ప్రణయ్‌ను వ్యాపారవేత్త మారుతి రావు 2018 సెప్టెంబర్ 14న ప్రణయ్‌ను హత్య చేయించారు. ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి పిర్యాదు మేరకు అప్పట్లో మారుతిరావుతో సహా మొత్తం ఎనిమిది నిందితులపై మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని అరెస్ట్ చేసి వరంగల్ సెంట్రల్ జైలుకు పంపారు. కేసు విచారణ నడుస్తుండగానే పాల్పడ్డ ఏ1 నిందితుడు మారుతీరావు హైదరాబాదులో లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏ2గా ఉన్న సుభాష్ శర్మ, ఏ3 అజ్గర్ అలీలు జైల్లో ఉండగా ఏ1 మారుతిరావు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏ4 మహమ్మద్ బారి, ఏ5 మహమ్మద్ అబ్దుల్ కరీం, ఏ6 తిరునగరు శ్రవణ్, ఏ7 సముద్రాల శివ, ఏ8 ఎం ఏ నిజాంలు 5 గురు బెయిల్ మీద ఉన్నారు.ఇప్పటి వరకు



192 మంది సాక్షులను విచారించి 1800 పేజీల ఛార్జ్ షీట్‌ను 2019లో కోర్టుకు సమర్పించారు. హత్య చేసిన సంఘటనపై సీసీ పుటేజీలో నమోదు కాగా అప్పట్లో ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం ఐయింది. అప్పటి ఎస్పీ ఏవి రంగనాథ్ కేసును సవాలు తీసుకొని కేసును ఛేదించారు. వాదనలు పూర్తి కాగా నేడు తుది తీర్పు ఇవ్వనున్నారు. దింతో తీర్పుపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది.

జిల్లా కోర్టు వద్ద భారీ బందోబస్తు

ప్రణయ్ హత్య కేసు తీర్పు వెలవడం ఉండడంతో జిల్లా కోర్టు ముందు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.ఎస్పీ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేయగా అనుమతి లేకుండా కోర్టులోకి ఎవరూ అనుమ తించకుండ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా ఎస్పీలు గా పని చేసిన పోలీస్ అధికారులు కోర్టుకు హాజరు కానున్నారు.

హామీలు అమలు చేసి పేదలను ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్

నవతెలంగాణ-మిర్యాలగూడ

హామీలు అమలు చేసి పేదలను ఆదుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బాపూజీ నగర్‌లో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సందర్బంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు అనేక హామీ ఇచ్చి ఓట్లు వేయించుకుందని ఇప్పుడు అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు హామీలు అమలు అవుతాయని తమ కుటుంబానికి సంక్షేమ పథకం అందుతుందని పేద ప్రజలు ఎంతో ఆశపడ్డారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం లో హామీలు అమలు కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు అర్హులైన పేదలందరికీ ఇందిర ఇండ్లు, రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్



చేశారు. హామీల అమలు కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 24 నుంచి 26 తేదీల వరకు మిర్యాలగూడలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) వన్ టౌన్ కార్యదర్శి మల్లు గౌతమ్‌రెడ్డి, శాఖ కార్యదర్శి రాళ్ల బండి శివరాజు, రామారావు లక్ష్మణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వేడుకలా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-పెద్దవూర

నాగార్జునసాగర్ నియోజకవర్గం పెద్దవూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997-98 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల 27 ఎడ్ల తరువాత ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక జెడ్పిహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో వేడుకలా ఉగాది శోభ ఉట్టిపడేలా చదువుల తల్లి సరస్వతి దేవీ జ్యోతి ప్రజ్వలన చేసి జరుపుకున్నారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. నాటి మధుర జ్ఞాపకాలు అనుభూతులు పంచుకున్నారు. వ్యాపారవేత్తలు, డాక్టర్లు, ఇంజనీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇలా వివిధ రంగాల్లో స్థిరపడిన 50 మందికి పైగా



విద్యార్థులు ఈ ఆత్మీయం సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మీరు ఎక్కడ వున్న, ఏ స్థితిలో వున్న మీ స్నేహబంధం చివరివరకు వుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, నర్సిరెడ్డి, సిహెచ్ లింగారెడ్డి, చెన్ను శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణ, పాపిరెడ్డి, విజయ్‌రెడ్డి, సమ్మోహన్, ఎన్ రామ్ బిక్షం, సిహెచ్ స్వామి, హరీష్, సుధాకర్‌రెడ్డి, యశోద, పద్మ పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న రైతుల పాల బిల్లులు చెల్లించాలి

నవతెలంగాన-చిట్యాల

వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ రైతులకు కొద్దిపాటి ఉపశమనాన్ని కలిగిస్తుందని నమ్మి ప్రభుత్వ సంస్థ అయిన మదర్ డెయిరీకి పాలు పోసిన రైతులకు రెండు నెలలకు పైగా ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు.ఆదివారం చిట్యాల మండలం ఎలికట్టె గ్రామంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడం ముందుస్తుగా సాగునీటితో చెరువులను నింపలేదన్నారు. దీంతో భూగర్భజలాలు అడుగంటి రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోవడంతో ఆర్థికంగా నష్టపోయారన్నారు. ఇప్పటికైనా నీటిని వృథా చేయకుండా గొలుసు కట్టు పద్ధతుల్లో చెరువులను నింపి భూగర్భజలాలు పెరిగే విధంగా చేసి రాబోయే వేసవి కరువు నుండి ప్రజలను కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు సత్తయ్య, శంకరయ్య, ముత్తయ్య, అంజయ్య పాల్గొన్నారు.

17నుంచి కేఎస్‌ఎం డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు

- బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ



ఈ నెల 17, 18 తేదీలలో కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 17,18 తేదీలలో జరిగే జాతీయ సదస్సు బ్రోచర్ ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెఎస్‌ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రీసెర్చ్ కు సంబంధించిన అంశాలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి కళాశాల అభివృద్ధికి తోడ్పడాలని అధ్యాపకులకు పిలుపునిచ్చారు. కళాశాలలో మొదటి సారిగా జరిగే ఈ జాతీయ సదస్సును విజయవంతం చేయాలన్నారు. అనంతరం కళాశాలలో జరిగే అభివృద్ధి పనులను గురించి చర్చించారు. కళాశాల అధ్యాపకుడు సెమినార్ కన్వీనర్ డాక్టర్ గుమ్మడి నరేష్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ భీమార్జునరెడ్డి, వెంకటరమణ శేఖర్ రెడ్డి బోధన బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బ్రహ్మదేవర రామ్మూర్తి, నాల్గో వార్డుకు చెందిన పల్స సోమయ్య, 16వ వార్డు కౌన్సిలర్ ఘర్షకోటి సైదులు మాతృమూర్తి ఘర్షకోటి సావిత్రమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశం ఆ మృతదేహాలను సందర్శించి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరా మర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ చౌగోని రజిత శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అదేవిధంగా నకిరేకల్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బ్రహ్మదేవర రామ్మూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. అదేవిధంగా 16 వార్డు కౌన్సిలర్ ఘర్షకోటి సైదులు మాతృమూర్తి సావిత్రమ్మ అనారోగ్యంతో మృతి చెందింది.ఆదివారం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఇరు మృతదేహాలను సందర్శించి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మెన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-నకిరేకల్



కట్టంగూరు మండలం మల్లారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మహిళా కార్యకర్త దాసరి పిచ్చమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ ఆమె మృతదేహంపై ఆ పార్టీ జెండా కప్పి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం నకిరేకల్‌లోని నాలుగవ వార్డుకు చెందిన సీపీఐఎంఎల్ జనశక్తి సీనియర్ నాయకులు చిటూరి సోమయ్య, కౌన్సిలర్ ఘర్షకోటి సైదులు మాతృమూర్తి సావిత్రమ్మ, ప్రముఖ వ్యాపారవేత్త బ్రహ్మదేవర రామ్మూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు.ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు సన్మానం

నవతెలంగాణ-నకిరేకల్

వాసవికపుల్స్ క్లబ్, వాసవిక్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా శనివారం రాత్రి పట్టణంలోని వీఎస్‌కెఎస్ క్లేవ్‌లో వివిధరంగాలకు చెందిన మహిళలను ఘనంగా సన్మానించారు. అంతకుముందు మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ చౌగోని రజిత శ్రీనివాస్‌గౌడ్, ప్రముఖ వైద్యురాలు సోమ సుశ్రుత, వాసవి క్లబ్, వాసవి కపుల్స్ క్లబ్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాత్మా హైస్కూల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



పట్టణకేంద్రంలో గల మహాత్మ హైస్కూల్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కొప్పు వాణి లింగస్వామిగౌడ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండే విద్యార్థినులు తమ హక్కులను వినియోగించుకుంటూ చక్కగా చదివి అన్ని రంగాలలో ముందుండడానికి ప్రయత్నం చేయాలన్నారు.నేడు స్త్రీలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తుండడం అభినందనీయమన్నారు.విద్యార్థులు వారి నుండి స్ఫూర్తిని పొంది లింగ వివక్ష లేని సమాజాన్ని నెలకొల్పడానికి ప్రయత్నించాలని కోరారు.ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళా అధ్యాపకులకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చిటూరి సోమయ్య అంత్యక్రియలో పాల్గొన్న విమలక్క

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్‌కు చెందిన సీపీఐఎంఎల్ జనశక్తి సీనియర్ నాయకులు చీటూరి సోమయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆదివారం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు విమలక్క సోమయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలేసి జోహార్లర్పించారు. అనంతరం దహనసంస్కారాల కార్యక్రమంలో పాల్గొన్నారు.సోమయ్య కూతురు పల్స నిర్మల తన తండ్రికి అంత్యక్రియలు నిర్వహించారు.

సీతారాములుకు ఒడిబియ్యం సమర్పణ

నవతెలంగాణ-నకిరేకల్

మన అమ్మ మనసారే మనసారా కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని కొండ పద్మ పాండు ఇంటి ఇంటి నుండి తీసుకొచ్చిన ఒడిబియ్యం మార్కెట్ రోడ్డు ఆంజనేయస్వామి దేవాలయం సీతారాములుకు సమర్పించారు.ఈ కార్యక్రమంలో గుడి చైర్మెన్ పైళ్ళ శశిధర్‌రెడ్డి, కనకదుర్గ గుడి చైర్మెన్ బ్రహ్మదేవర పద్మ అధ్యక్షురాలు రావిరాల కవిత, కార్యదర్శి చల్లరమా, కోశాధికారి మూడుదుడ్ల వెంకటలక్ష్మి ప్రతినిధులు గర్రె ఝాన్సీ, కాసర్ల లక్ష్మి మిర్యాల ప్రభ, కొండ సుజాత, బొబ్బిలి సరిత, మూడుదుడ్ల లక్ష్మి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-క్లాక్‌టవర్

పట్టణంలోని స్థానిక బొట్టుగూడ ఉన్నత పాఠశాలలో 2001-2002 సంవత్సరంలో చదువుకున్న సుమారు 60 మంది పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గత 22 ఏండ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థిని, విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుని తమ యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు గీఎక్కడో పుట్టి ఎక్కడో పెరగాలి గీతాలపన చేస్తూ అందర్నిఅలరించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ సదుపాయాలు లేని నాటి రోజుల్లో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నతస్థాయిలో ఉండడం తమకు గర్వకారణంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్ సీఐగా పీఎన్డీ ప్రసాద్ బాధ్యతలు

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ రూరల్ సీఐగా పిఎన్డి ప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. చార్మినార్జంలోని మొగలాపూర్ సీఐగా పని చేసిన పిఎన్డి ప్రసాద్ బదిలీపై మిర్యాలగూడ రూరల్‌కు వచ్చారు. గత సంవత్సరం క్రితం మిర్యాలగూడ వన్ టౌన్ సిఐగా 25 రోజులపాటు విధులు నిర్వర్తించారు. పార్లమెంట్ ఎన్నికల దృశ్య అప్పట్లో బదిలీ చేశారు. మిర్యాలగూడ వన్ టౌన్ సిఐగా వస్తారనుకున్న చివరికి నిమిషంలో మిర్యాలగూడ రూరల్ సిఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా మిర్యాలగూడ రూరల్ మూడవ ఎస్సైగా సైదులు బాధ్యతలు స్వీకరించారు.

నేడు కేవీపీఎస్ విస్తృతస్థాయి సమావేశం

నవతెలంగాణ-పెద్దఅడిశర్లపల్లి

నల్గొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో నేడు జరిగే కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం విస్తృత స్థాయి సమావేశంలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెరిక విజయ్‌కుమార్ ఆదివారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధానకార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు హాజరవుతారని ఒక ప్రకటనలో తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత: ఎమ్మెల్యే

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గూడూరు గ్రామంలో శ్రీ సీతారామాంజనేయస్వామి వారి కల్యాణోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-చిట్యాల

తిరుమలనాథ స్వామి అనుగ్రహంతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో తిరుమలనాథ స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డితో కలిసి స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కాటం వెంకటేశం, మండల పార్టీ అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనరసింహ, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యురాలు పాపని వనజ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-చిట్యాల

చిట్యాల పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కామినేని హాస్పిటల్స్ హైదరాబాద్ వారు ఉచిత హెల్త్‌క్యాంపు నిర్వహించారు. సమాచార హక్కు ప్రజా చైతన్య సమితి అధ్యక్షుడు డాక్టర్ బొడ్డు బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యాంపునకు సుమారు 200 మంది హెల్త్ చెకప్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కామినేని పీఆర్‌ఓ బత్తుల యాదగిరి, కనకదుర్గమ్మ గుడి చైర్మెన్ మారగోని ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు ఎద్దులపురి కృష్ణ పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని కారు ఢీకొని ఇద్దరు మృతి





నవతెలంగాణ-నార్కెట్‌పల్లి

ఆగి ఉన్న లారీని కారు ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన ఆదివారం నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామంలోని మదీనా టీ స్టాల్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ డి.క్రాంతి కమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాకు చెందిన చిలాసాగరం సందీప్ గౌడ్ అతని స్నేహితులు కుంచ సాయికుమార్ గౌడ్, దండుగుల మధుకర్, హరీష్, ప్రవీణ్, అందరూ కలిసి టీజీ 08 జీపీ8686 నెంబర్ గల కారులో అల్వాల్ నుండి బయలుదేరి విజయవాడకు వెళుతుండగా.. మార్గ మధ్యలో ఏపీ లింగోటం గ్రామంలోని మదీనా టీ స్టాల్ ముందు ఎన్ హెచ్ 65 రోడ్డుపై పార్క్ చేసి ఉన్న ఏపీ 04 టీయూ4644 నంబర్ గల లారీని వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ఘటనలో సందీప్ గౌడ్, సాయికుమార్ గౌడ్‌లు అక్కడికక్కడే మృతి చెందగా.. మిగతా ముగ్గురికి స్వల్ప గాయాలైనాయి. మృతులను నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలైన వారిని కిమ్స్ హాస్పిటల్ నార్కట్ పల్లికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఇట్టి విషయం తెలిసిన చి లసాగరం సందీప్ గౌడ్ అన్న చిల సాగరం అమర్నాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నందిని హోటల్ ప్రారంభం

నవతెలంం.గాణ-క్లాక్‌టవర్

నల్గొండ పట్టణం హైదరాబాద్ రోడ్ లో నందిని హెూటల్‌ను మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం కస్టమర్లకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని నిర్వాహకులకు తెలియజేశారు. హోటల్ యాజమాన్యం వారు ప్రారంభించిన వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెల్ల కిరణ్‌కుమార్,రాపోలు వెంకటేశ్వర్లు, వరకాల నరేష్‌కుమార్, తాడిశెట్టి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లకు చేరిన 10వ తరగతి సెట్-2 ప్రశ్నపత్రాలు

నవతెలంగాణ-పెద్దవూర



ఈ నెల 21 నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు సెట్-2 ఆదివారం జిల్లా నుంచి సాగర్ నియోజకవర్గంలోని పలు పోలీస్ స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ ప్రశ్న పత్రాలను ఆయా పరీక్ష కేంద్రాల కస్టోడియన్లు, డిపార్టుమెంట్ అధికారులు, స్వాధీనం చేసుకొని వాటిని శీల్ చేసి ఆయా సెంటర్లకు సంబంధించిన సీఎస్, డీవోల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో తేదిల వారిగా భద్రపరిచారు. ప్రశ్న పత్రాలను భద్రపరచుట క్రమాన్ని మండలం విద్యాశాఖ అధికారులు తరి రాము, గుండా కృష్ణ మూర్తి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా జాగ్రత్తగా ప్రశ్నా పత్రాల ని భద్రపరచాలన్నారు. క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే స్ట్రాంగ్ రూమ్‌లో భద్ర పరచాలని తెలిపారు. ఆయా సెంటర్లకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు సరిపడా వచ్చాయా లేదా అనేది ధ్రువీక రించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు అధికారులు రేపాల అశోక్, ఉమ్మడి నారాయణరెడ్డి, గుంటుక రమణారెడ్డి, హిమావంత రెడ్డి, శేషు, రామకృష్ణా రెడ్డి, సైదులు, శ్రీధర్ పాల్గొన్నారు.

మారోజు చంద్రమౌళి ఆశయాలను సాధిద్దాం

నవతెలంగాణ-నకిరేకల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన మారోజు చంద్రమౌళి ఆశయాలను సాధించాలని శాలిగౌరారం సీపీఐ(ఎం) మండల కార్యదర్శి చలకాని మల్లయ్య కోరారు. ఆదివారం స్థానిక అమరవీరుల స్మారకభవనంలో చంద్రమౌళి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలలేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాలీగౌరారం మండలం గురజాల గ్రామంలో జన్మించిన చంద్రమౌళి చిన్నతనం నుండి పేద ప్రజల తరఫున అన్యాయాలను ఎదిరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడంలో ముందున్నారన్నారు. గ్రామ, మండల స్థాయిలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం కృషి చేశారన్నారు. సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి నుండి మండల కార్యదర్శిగా మూడు పర్యాయాలు పనిచేశారన్నారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పని చేస్తూ 2001లో గురజాల ఎంపీటీసీగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. భవిష్యత్తులో నేటి యువత అమరవీరుల పోరాట పటిమను, ఉద్యమ స్ఫూర్తిని తీసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కోరారు.ఈ సమావేశంలో పార్టీ మండల నాయకులు జగన్, కల్లూరు లింగయ్య, సైదుల శ్రీనివాస్,నంపత్‌కుమార్,కరుణాకర్ పాల్గొన్నారు.

'ఆశా వర్కర్‌పై లైంగికదాడికి పాల్పడ్డ నిందితున్ని కఠినంగా శిక్షించాలి'

నవతెలంగాణ-క్లాక్‌టవర్

జగిత్యాలలో ఆశా వర్కర్ పై లైంగికదాడికి పాల్పడ్డ నిందితునిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బాధితురాలికి న్యాయం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ ఫోలే సత్యనారాయణ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాలలో ఆశ వర్కర్ విధులు ముగించుకుని వస్తున్న సందర్భంలో లైంగికదాడికి ఒడిగట్టిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని లైంగికదాడికి పాల్పడిన నిందితునిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని, ఆశా వర్కర్‌కు ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి బాధితురాలికి నష్టపరిహారంగా రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. గ్రామాలలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్‌లకు రక్షణ కల్పించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. మెడికల్ డిపార్ట్మెంట్ నుండి కూడా కొంత ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి అత్యాచారాలకు పాల్పడిన వారిపై కఠిన శిక్షలు పడేవిధంగా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండ తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకునే ముందే ఇలాంటి సంఘటనలు జరగడం మహిళలకు ఏ పాటి రక్షణ ఉందో అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచ అందాల పోటీలను బహిష్కరించాలి

నవతెలంగాణ-మోతె



హైదరాబాదులో నిర్వహించు ప్రపంచ 72వ అందాల పోటీలను బహిష్కరించాలని టీపీటీఎఫ్ పూలన్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సభ ఎర్రబోయిన మంగమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొనిపులన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నరసమ్మ మాట్లాడుతూ మహిళా దినోత్సవం స్ఫూర్తితో హక్కులకై స్త్రీ పురుష సమానత్వం కోసం అసమానతలు లేని సమ సమాజం కోసం ప్రతి మహిళ చైతన్యం కావాలన్నారు ఈ కార్యక్రమంలో కొత్తపెల్లి ఎల్లమ్మ పొడపంగి రావమ్మ ఐలమ్మ లింగమ్మ పాల్గొన్నారు.

వేణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కమిషనర్

నవతెలంగాణ-సూర్యాపేట



మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా కొప్పుల వేణారెడ్డి నియామకం అయిన సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం స్థానిక వైట్ హౌజ్‌లో వేణారెడ్డిని మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి పుష్పగుచ్ఛము అందించి శాలువాతో సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో శానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ టీపీఓ ఉయ్యాల సోమయ్య, టీపీఎస్ శశికుమార్, జూనియర్ అసిస్టెంట్లు యండి గౌసుద్దీన్, యెస్.యెస్.ఆర్.ప్రసాద్, ఇండ్ల మనోజ్‌కుమార్, అజీముద్దీన్, బాషుమియా, ఏ.శ్రీను, టి.శివశంకర్, పూర్ణ చంద్ర రెడ్డి,హరీష్ ,రఫీ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం ఎదురుచూపులు

నవతెలంగాణ-మునగాల

ఈ యాసంగిలో వెంకట్రాపురంలో ఎస్సారెస్పీ కాల్వకింద సాగు చేసిన వరి పంటలు నీరందక ఎండిపోతున్నాయి. కాల్వ నీటినే నమ్ముకున్న రైతులు కంటతడి తప్పడం లేదు. నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించటంతో రైతులు వరి పంటలు నాటారు. పొలాలు నాట్లు వేసి రెండు నెలలు దాటినా ఇంత వరకు కాల్వకు చుక్క నీరు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు అటోఇటో బోరు నీళ్లతో పంటలను బతికించుకున్నామని, భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. ఎండలు ముదరటంతో బోర్లలో నీరు అడుగంటిపోయాయి. దీంతో తీరా పొట్టదశకు ఇంకా ఈనుతున్న పొలాలు ఆరి నెర్రెలు పట్టాయని గ్రామ రైతులు తెలుపుతున్నారు. వారం పది రోజులకు ఒకసారైనా కాల్వ నీరు వస్తే బోరు బావుల్లో నీరు దొరికేవని రైతులు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోయిస్తే తమకు ఈ నీటి కష్టాలు తప్పేవని రైతులు అంటున్నారు. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి అప్పుల పాలయ్యానని వెంకట్రాపురం గ్రామాని కి చెందిన దొంగరి సత్యం అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యాసంగిలో 3 లక్షల పెట్టుబడులు పెట్టి 15 ఎకరాల వరి సాగు చేశానని తెలిపారు. ఇప్పటికి ఐదెకరాలు పూర్తిగా ఎండిపోయిందన్నారు. రేపో మాపో శ్రీరాంసాగర్ నీరురాక పోతే వున్న పొలం కూడా ఎండిపోయో అవకాశం వందన్నారు. ఇంకా అదే గ్రామానికి చెందిన దొంగరి సురేష్‌కు చెందిన మూడెకరాలు. జెట్టి చిన్న లక్ష్మయ్య,పెద లక్ష్మయ్యలది చెరి ఐదెకరాల పొలం పొట్ట దశలో ఎండి పోవటంతో తల పట్టుకున్నారు. ఇంకా నేలమర్రి గ్రామానికి చెందిన బట్టు పెల్లి సుందయ్య ఐదెకరాలు నీరు లేక నెర్రెలు కొట్టింది. ఏడు ఎకరాలు నాటు పెడితే ఇప్పటికే ఐదెకరాలు ఎండిపోయిందన్నారు. కౌలుకు చేసే పొలం కూడా ఈనేటప్పుడు ఎండిందన్నారు. మొత్తం పొలానికి



వ్యవసాయ ఖర్చులు లక్షన్నర అయినట్లు చెప్పారు. ఇప్పుడు గొర్రెల మేతకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 2018 నుంచి 2023 డిశంబరు వరకు కేసీఆర్ హయాంలో రెండు పంటలకు నీరందించారని చెప్పారు. నడి వేసవి కాలంలో కూడా కాల్వల ద్వారా ఈ ప్రాంతానికి శ్రీరాంసాగర్ నీరు వచ్చాయని చెప్పారు. చెర్వులు కుంటలు నిండి సాగు తాగు నీటికి ఇబ్బంది లేకుండా వుండేదని రైతులు పేర్కొంటున్నారు. ఎప్పు డైతే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందో అప్పటి నుంచి తమకు సాగు నీటి కష్టాలు మొదలైయ్యాయని బాధిత రైతులు తెలుపుతున్నారు. కాల్వకు సరిపడా నీటి విడుదల చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియటం లేదన్నారు. కంటిమీద కునుకు లేకుండా అయిందంటున్నారు.

నీరందని కారణంగా తాడువాయిలో వంద. వెంకట్రాపురంలో వంద. నేల మర్రిలో మూడు వందల ఎకరాల పంటలు ఎండి పోయాయని రైతులు తెలుపుతున్నారు. ఏ గ్రామంలో చూసినా రైతులు నీటి కష్టాలే చెప్పుకోవటం వినిపిస్తుంది. తినటానికి తిండి గింజలు. పశువులకు గ్రాసం కూడా కరువైందని బాధ పడుతున్నారు. చేసిన పంటలు ఎండిపోతే తమ కుటుంబాలు ఎలా గడిచేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కాల్వకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి వున్న పంటలకైనా ఊపిరి పోయాలని రైతులు కోరుతున్నారు.

పరిస్థితి అధ్వాన్నంగా ఉంది:దొంగరి సత్యం రైతు వెంకట్రాంపురం



నేను ఈ వేసవిలో పది హేను ఎకరాలలో వరి పంట వేశాను. నీరు లేక ఇప్పటికే ఐదెకరాలు ఎండిపోయింది. మొత్తం మూడు లక్షల పెట్టుబడులు పెట్టాను. ఇప్పుడు పరిస్థితి అధ్వాన్నంగా వుంది. శ్రీరాం సాగర్ నీరు రాక పోతే వున్న పొ లం కూడా చేతి కందే అవకాశం లేదు. వెంటనే నీరు సరిపడా నీటి ని విడుదల చేసి పంటలను కాపాడాలి.

ఐదు ఎకరాలు ఎండింది: బట్టుపెల్లి సుందరయ్య రైతు నేలమర్రి



శ్రీరాం సాగర్ నీరు వస్తుందనే ఆశ తో ఎడు ఎకరాలు సాగు చేశాను. ఇందులో ఐదెకరాల పొలం ఎండి పోయింది. బోర్లు పోయటం లేదు. లక్షన్నర పెట్టుబడి పెట్టాను.ఒక్క తడి నీరొచ్చినా తమ పొలాలకు ఈ గతి పట్టేదికాదు.కాల్వ చివరి భూముల వరకు నీరందించి పం టలను కాపాడాలి.

ఎస్సీ వర్గీకరణ తర్వాతే గ్రూప్స్ ఫలితాలను విడుదల చేయాలి



నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్

తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు గ్రూప్1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఫలితాలతో పాటు అన్ని రకాల ఉద్యోగ పరీక్ష ఫలితాలను నిలుపుధల చేయాలని ఆదివారం ఆత్మకూరు ఎస్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరవధిక దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మేడి కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయడంతో పాటు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా రిజర్వేషన్లు కేటాయించకుండా ఉద్యోగ నియామక ఫలితాలను విడుదల చేయడంతో మాదిగ నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తర్వాతనే ఉద్యోగ నియామక ఫలితాలు విడుదల చేయాలని అప్పటివరకు ఫలితాల విడుదలను నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి తిప్పర్తి గంగరాజు మాదిగ,ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు పెడమర్తి ఉమేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల అధికారి ప్రతినిధి మిరియాల చిన్ని మాదిగ పిడమర్తి పొట్ట పెంజర మురళి మాదిగ, వెంకటేష్ మాదిగ, ఉన్నారు.

'ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేయాలి'

నవ తెలంగాణ-సూర్యాపేట



ఆర్థిక లాభమే కాకుండా ఆసుపత్రికి వచ్చే ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా వైద్యులు సేవలు అందించాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక వినూత్న న్యూరో, గ్యాస్ట్రో ఆసుపత్రి ప్రధమ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్, విజయవాడ మహానగరాలకు మధ్యలో ఉన్న సూర్యాపేట జిల్లా ప్రజలకు అత్యుత్తమమైన సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన వినూత్న ఆసుపత్రి అనతి కాలంలోనే ప్రజల మన్ననలు పొందిందన్నారు. న్యూరో గ్యాస్ట్రో విభాగాల్లో సేవలు అందిస్తున్న డాక్టర్ రిజ్విన్ ఉదయలు బెంగళూరులోని ఉన్నతమైన యూనివర్సిటీలో చదువుకొని ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఆసుపత్రి సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. లక్షల రూపాయల ఖర్చుతో కూడుకున్న న్యూరో గ్యాస్ట్రో వైద్యాన్ని పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారం పడకుండా సేవలందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి అన్ని విభాగాల్లో సేవలందించేలా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా వినూత్న అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం మల్లారెడ్డి, కమలాకర్, వేణుమాధవ్, రాజు, వైద్యులు రిజ్విన్, ఉదయ్, ప్రవల్లిక, అమూల్య, మేనేజ్‌మేట్ నగేష్, మధుకర్, మాజీ కౌన్సిలర్లు జ్యోతి కరుణాకర్, వెంకన్న శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కదం తొక్కిన పద్మశాలీలు

నవతెలంగాణ-తిరుమలగిరి



తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామార్థపు మురళీ ఆదేశాల మేరకు రాష్ట్ర నాయకులు మేన వెంకన్న, జిల్లా అధ్యక్షులు బొడ్డు గోవిందరావు సూచనల మేరకు హైద్రాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగుతున్న అఖిల భారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి ఉమ్మడి మహాసభల కోసం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలము నుండి తుంగతుర్తి నియోజక వర్గ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం కన్వీనర్, బి సి సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి వంగరి బ్రహ్మం నేతృత్వంలో పద్మశాలియులు కదం తొక్కారు.మండలంలోని మాలిపురం, తిరుమలగిరి,తొండ,తాటిపాముల గ్రామాలనుండి పద్మశాలి కుల భాంధవ్యులు భారీ సంఖ్యలో హైద్రాబాద్‌కి తరలి వెళ్లారు. రాజ్యాధికారం లో పద్మశాలియుల వాట కొరకు ప్రభుత్వానికి తన వర్గ సంఖ్యా బలాన్ని చూపించేందుకు ఉత్సాహంతో ఉరకలు వేస్తూ పోరాటానికి సిద్ధం అయ్యారు. ఈ కార్యక్రమం లో నాయకులు మద్దూరి సోమయ్య(దాసు), దుస్స సత్యానారాయణ, వంగరి రాములు, వంగరి వెంకన్న,మద్దూరి ఉమేష్,మద్దూరి వెంకన్న (వకీలు), వంగరి ఉపేందర్, అమృతం రాజు, వంగరి సిద్దయ్య, వంగరి ఉమేష్, వంగరి సోమయ్య (సోమనర్సయ్య), వంగరి సోమయ్య(నర్సయ్య), మంచే అంబదాస్, వెంగలి పాండయ్య, రాపోలు కొండయ్య, వంగరి రమేష్, అక్కల ఉప్పలయ్య,అక్కల లక్ష్మయ్య, బేతు శ్రీహరి, నల్ల వెంకటేశ్వర్లు, మూడ నాగరాజు, విడెం శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వంగరి రాజు, కస్తూరి కృష్ణ, కోమటి శేఖర్, మద్దూరి తిరుమలేశ్, గర్దాసు చంద్ర నారాయణ, బేతు ప్రవీణ్, ఎనగంధుల రవి, వీరబత్తిని మురళీ,గుండేటి కృష్ణ,మద్దూరి శేఖర్, వంగరి కిషన్,పొట్టబత్తుల శంబయ్య, వంగరి సోమక్రిష్ణ, మద్దూరి శంకరయ్య, వెంగలి మధు, దుస్స రామ్మూర్తి, మద్దూరి కృష్ణ మూర్తి,వంగరి రమేష్,కోట రాములు తదితరులు పాల్గొన్నారు.

రవన్న 9వ వర్థంతి

నవతెలంగాణ-కోదాడటౌన్

స్థానిక లాల్ బంగ్లాలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) 9వ, వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి పాల్గొని మాట్లాడుతూ కామ్రేడ్ రవన్న తన జీవితాన్ని పీడిత ప్రజల విముక్తికై అంకితం చేసిన గొప్ప ఆదర్శ విప్లవోద్యమ నేత అని అన్నారు తెలంగాణ పోరాట వారసత్వం కలిగిన కుటుంబంలో జన్మించి ఉన్నత చదువులు మధ్యలో వదిలేసి నక్సల్బరీ ప్రేరణతో ఉద్యమ బాట పట్టాడని ఆనాటి నుండి చనిపోయే వరకు 50ఏండ్ల సుదీర్ఘ కాలం పాటు అజ్ఞాత జీవితం గడిపారని తెలియజేశారు అధ్యయనంలో నిత్య విద్యార్థిగా ఆచరణ శీలిగా నిలిచిన నికార్సైన విప్లవ కమ్యూనిస్టు యోధుడు అని అన్నారు పెత్తందారులకు భూస్వాములకు వ్యతిరేకంగా అణగారిన ప్రజల పక్షాన ఆయుధం ఎత్తిన దళపతి కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ అని నేటి తరానికి రవన్న జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమైందని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బూర్జువా పాలకవర్గ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడటమే కామ్రేడ్ రవన్నకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు ఈనెల 11న ఖమ్మంలో జరిగే కామ్రేడ్ రవన్న సంస్మరణ సభను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి వక్కవంతుల నరసింహారావు, అలుగుబెల్లి సత్యనారాయణ రెడ్డి, పోకల మైసయ్య, వీరబాబు, సైదులు, నరసింహారావు, గౌస్, సలీం, సాలమ్మ, చోటు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-కోదాడటౌన్

గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని సూర్యాపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సామాజికవేత్త రాచకొండ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం కోదాడ పట్టణంలో బాయ్స్ హై స్కూల్, మార్కెట్ పరిసరాలలో ప్రజలకు మైకులో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్, మద్యం, గుట్కా, తంబాకు వంటి చెడు అలవాట్లతో ఎంతోమంది జీవితాలు నాశనం అవుతున్నాయని వారిని నమ్ముకున్న కుటుంబాలు రోడ్డు పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ మత్తు పదార్థాల బారిన పడకుండా ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఆదివారం పండుగ సెలవు దినాల్లో జిల్లావ్యాప్తంగా తనవంతు బాధ్యతగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

దేవాలయ భూములు అక్రమిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-చివ్వెంల

దేవాలయ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓ కుశలయ్య అన్నారు. మండల పరిధిలోని బండమీది చందుపట్ల, వెంకటి తండా గ్రామాల్లో ఆదివారం శ్రీ దేవల్ బాలాజీ వెంకటేశ్వర స్వామి భూములల్లో అక్రమంగా అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈ గ్రామాల్లో దేవాలయ భూములల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా తమ శాఖ అధికారులను సంప్రదించి అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేసుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ భూముల్లో కౌలు తీసుకున్న రైతులు అనుమతి తీసుకోని బోర్లు వేసుకోవాలని వెల్లడించారు. చందుపట్ల గ్రామంలో దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న భూమిలో అక్రమంగా నూతన బిల్డింగ్ నిర్మాణం చేస్తున్న వాటిని పరిశీలించారు. సదరు గుత్తేదారుపై మాకు తెలియకుండా నిర్మాణం ఎలా చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే నిర్మాణం ఆపకపోతే కలెక్టర్ కు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని అన్నారు. అనుమతులు తీసుకునే వరకు భవన నిర్మాణం చేపట్టవద్దని వారిని అక్కడనుండి పంపించారు. ఈ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ విషయమై ఉన్నతదికారులకు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మార్కెట్ వైస్ చైర్మెన్‌కు అభినందనలు

నవతెలంగాణ-సూర్యాపేట రూరల్

మండల పరిధిలోని టేకుమట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గట్టు శ్రీనివాస్ సూర్యాపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారికి మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మండల్ రెడ్డి వేణుగోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ భాస్కర్ నాయక్ ఆదివారం తన స్వగ్రామంలో అభినందనలు తెలిపి, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా గట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ.. మార్కెట్ వైస్ చైర్మెన్‌గా నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రికి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పటేల్ రమేష్‌రెడ్డికి, కాంగ్రెస్ నాయకులు, టేకుమట్ల గ్రామ నాయకులకు, ప్రజలకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చౌగొనిఅనంత రాములు, నోముల వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులకు బెడ్ షీట్ల పంపిణీ

నవతెలంగాణ-తిరుమలగిరి



మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం బెడ్ షీట్లను విద్యార్థినిలకు అందించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ భూక్య కవిత అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి ఇట్టమల్ల శాంతయ్య పాఠశాలలోని 195 మంది విద్యార్థినులకు బెడ్ షీట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి, విద్యార్థుల చదువు కోసం ఎన్నో అవకాశాలు, సౌకర్యాలు కల్పిస్తుందని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా పదవ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు బాగా చదువుకొని పరీక్షలు బాగా రాసి పాఠశాలకు చదువు నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ఉపాధ్యాయినిలు వాణిశ్రీ, కళావతి, ఇందిరా, యశోద, శిరీష, సంతోష సునీత, మమత, ఝాన్సీ పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి ఆటపాటలు దోహదం

నవతెలంగాణ-కోదాడటౌన్



కోదాడ పట్టణంలో ఉన్న ఆదిత్య స్కూల్ యాన్యువల్ డే సందర్భంగా.. ఆదివారం స్థానిక కోదాడ పట్టణంలో ఉన్న హుజూర్ నగర్ రోడ్డులో ఉన్న శ్రీ రస్తు ఫంక్షన్ హాల్ నందు ఘనంగా నిర్వహించారు. యాన్యువల్ డే కార్యక్రమంలో చిన్న పిల్లల ఆట పాటలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ గౌరీనాథ్, డాక్టర్ నిర్మల, కౌన్సిలర్ సుశీల రాజు, ఈనాడు పుల్లయ్య, గంధం బంగారు బాబు హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సందర్భంగా మాట్లాడారు. చిన్నపిల్లల మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అనేది ఎంతగానో హర్షించదగ్గ విషయం అని ఈ సందర్భంగా ఆదిత్య స్కూల్ యాజమాన్యాన్ని టీచర్స్‌ను అభినందించారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలు కూడా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కొండపల్లి హైందవి, గూడూరు అంజలి, మహబూబా, శ్వేత, వనిత తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బిక్కీ బుచ్చయ్య గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌడ్ లు వృత్తి ప్రమాదాల బారిన పడకుండా అందరికీ సేఫ్టీ మోకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ట్యాంకుబండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి గౌడ వ్యక్తికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ,వృత్తి నిర్వహిస్తున్న వారికి లైసెన్స్ ఇవ్వాలని అన్నారు. గౌడులు రాజకీయాలకతీతంగా ఐక్యమై తమ హక్కులు సాధించుకోవాలని అన్నారు. నీరా కేంద్రాన్ని ప్రభుత్వం ఎత్తివేయాలని చూస్తే గౌడులు చూస్తూ ఊరుకోరని ,ప్రతి జిల్లా కేంద్రంలో నీరా కేంద్రాలు ఏర్పాటు చేసి గౌడ్ లు ఆర్థికంగా బలపడేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దంతూరి సోమన్న, జిల్లా ఉపాధ్యక్షులు జలగం మల్లేష్, మండల అధ్యక్షుడు గుణగంటి బిక్షం, నాయకులు కసగాని బ్రహ్మం గౌడ్ ,గిలకత్తుల సోమయ్య,కట్ల కరుణాకర్ బట్టిపల్లి వెంకన్న, అబ్బ గాని లక్ష్మయ్య, గుణగంటి శ్రీను వెంకన్న గుండ్ల లింగయ్య, గిలకత్తుల ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా లయోలా స్కూల్‌లో గోల్డెన్ జూబ్లీ

- హాజరైన ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట రూరల్

50 ఏండ్లుగా ఎలాంటి వివాదం లేకుండా యాజమాన్యం లయోలా పాఠశాలను నిర్వహించి విద్యను అందించడం అద్భుతమైన విషయమని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. శనివారం లయోలా స్కూల్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు 1975-2025 బ్యాచుల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. చిన్ననాటి లయోలా పాఠశాలలో చదివిన మిత్రులు కలుసుకొని సంతోషాలు పంచుకోవడం ఎంతో సంతోషాన్నిస్తుందని తెలిపారు. బాల్యం నాటి మధుర క్షణాలను జ్ఞాపకాలను గుర్తుచేసుకోనేలా ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమం అని అన్నారు. లయోలా పాఠశాల ప్రారంభంలో గ్రామీణ ప్రాంతాల్లో డ్రాప్ ఔట్స్ ఎక్కువగా ఉండేవని, మంచి విద్యను అందిస్తూ వివిధ రంగాల్లో ఎంతోమందిని స్థిరపడేలా పాఠశాల యాజమాన్యం చేసిన కృషి ఎనలేనిదన్నారు. విద్య అనేది విజ్ఞానాన్ని, వివేకాన్ని, మనిషిని, మేధావిగా, ఉన్నతమైన వ్యక్తులుగా ఉండేలా దోహదం చేస్తుందని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సందర్భంగా మహిళలను ఘనంగా సన్మానించారు. ఆయా బ్యాచ్ లకు చెందిన విద్యార్థులు తమ తమ గురువులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. చిన్ననాటి మధురమైన క్షణాలను ఆస్వాదించారు. కార్యక్రమంలో లయోలా పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ లూయి దాస్, ప్రిన్సిపల్ ఫాదర్ సునీల్, కోర్ కమిటీ ప్రెసిడెంట్ ఆకారపు రమేష్, వైస్ ప్రెసిడెంట్ పుట్ట కిషోర్, సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ పారిశ్రామికవేత్త చలసాని శ్రీనివాసరావు, రాచర్ల కమలాకర్, లయోలా పాఠశాల గోల్డెన్ జూబ్లీ కోర్ కమిటీ నాయకులు ఎం, జావీర్ అమల్, జి, కృపారావు, పి, ఆనంద, రావు వెంకట్ రెడ్డి, బానోతు శ్రీధర్, ఎస్, శంకర్,వి, సైదిరెడ్డి, బి, పురుషోత్తం రెడ్డి, గుర్రం సత్యనారాయణ రెడ్డి, దేవరశెట్టి జనార్దన్, సైధి రెడ్డి, మద్ది శ్రీనివాస్ యాదవ్, బూర శేఖర్, శ్రీధర్, పూర్వ విద్యార్థులు విద్యార్థిని, విద్యార్థులు వేలాది మంది పాల్గొన్నారు.

వికాస్ ఫార్మసీలో గ్రాడ్యుయేషన్ డే సంబురాలు

- డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ రామ్ కిషన్



నవతెలంగాణ-సూర్యాపేట రూరల్

ప్రపంచ వ్యాప్తంగా ఫార్మసీ విద్యార్థులకు ఇటీవల కాలంలో బాగా డిమాండ్ ఏర్పడిందని రాష్ట్ర డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ రామ్ కిషన్ అన్నారు. శనివారం స్థానిక రాయన్‌గూడెం గ్రామ సమీపంలో గల వికాస్ కాలేజ్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌లో జరిగిన గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 70 మంది బీఫార్మసీ, ఫార్మసీ విద్యార్థులకు బంగారు పథకాలను యూనివర్సిటీ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్ కిషన్ మాట్లాడుతూ.. కరోనాకాలం తర్వాత ఫార్మసీ విద్యార్థులకు ఆరోగ్య రంగంలో ఎంతో ప్రాధాన్యత వచ్చిందని ప్రపంచవ్యాప్తంగా ఫార్మసీ విద్యార్థులు అందించిన సేవలను అనేక దేశాల అధినేతలు అభినందించారని అన్నారు. ఈ సందర్భంగా రెటష్ బో ఆసుపత్రుల ఉపాధ్యక్షులు డాక్టర్ నీరస ధాబాయ్ మాట్లాడుతూ.. దేశంలోని అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫార్మా డీ విద్యార్థులకుఅనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఉన్న 200 కార్పొరేట్ ఆసుపత్రిలో ఫార్మాట్ విద్యార్థులకు క్లినికల్ ఫార్మసిస్టులుగా అవకాశాలు వచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా ఏఎఫ్‌జి లైఫ్ సైన్స్ సీఈవో వి.హరీష్ రెడ్డి మాట్లాడుతూ..హైదరాబాదులో మునపటి కన్న ఎక్కువ ఫార్మసీ పరిశ్రమలు వచ్చాయన్నారు. చిన్న తరహా ఫార్మసీపరిశ్రమలతో ఎంతోమందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. కిస్ట్రాస్ ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ జై కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. తాను 2004-2008 బ్యాచ్‌లో వికాస్ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ పూర్తి చేశానని తాను సొంతంగా ఒక కంపెనీని స్థాపించి ఎంతోమందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. వికాస్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఎంతోమంది దేశ విదేశాల్లో మంచి స్థానాల్లో స్థిరపడ్డారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫార్మసీ కళాశాల సంఘం అధ్యక్షులు డాక్టర్ కే రామదాస్ కళాశాల కరస్పాండెంట్ సాదినేని శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆడేపు రమేష్, పాలనాధికారి దేవులపల్లి వినయ్, ప్రతిష్ఠ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ కిషోర్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ నీలమ్మ, డాక్టర్ స్వరూప, క్రీడల స్ఫూర్తి ప్రతినిధి పి. నవీన్ కుమార్, జి మహేష్, నటేష్, ఫెర్ హీన్, శైలజ, భవాని, డాక్టర్ నరసింహారావు, లిడియా, సుజాత రాంబాబు, ప్రియతమ్, మల్లెలత, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకిచ్చిన హామీలను అమలు చేయాలి



- తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ దక్షిణ తెలంగాణ కోఆర్డినేటర్ అనంతుల మధు

నవతెలంగాణ-సూర్యాపేట

గత ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ దక్షిణ తెలంగాణ కోఆర్డినేటర్ అనంతుల మధు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి రాసిన పోస్ట్ కార్డ్‌ను ఆదివారం స్థానిక పోస్ట్ ఆఫీస్ వద్ద గల బాక్స్‌లో వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆరు దశబ్దలా ఆత్మ గౌరవం కోసం, స్వరాష్ట్ర ఆకాంక్షకై ఉద్యమించిన తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారులకు గత ఎన్నికల సమయం లో కాంగ్రెస్ పార్టీ మ్యాని ఫెస్టో లో ప్రకటించిన హామీని వెంటనే అమలు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలి, మలి దశ ఉద్యమంలో ఆర్థికంగా నష్టపోయిన, అనారోగ్యలకు గురి అవుతున్న తెలంగాణ ఉద్యమ కారులను, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. ఎఫ్ఐఆర్ కేసులను మాత్రమే ప్రామాణికంగా తీసుకోకుండా,నాటి దినపత్రికలు, ఉద్యమ ఫొటోస్, వీడియో లను కూడా పరిగణలోకి తీసుకోని, తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమం లో పాల్గొన్న ప్రతి ఒక్క తెలంగాణ ఉద్యమకారుడిని స్వాతంత్ర సమర యోధుడిగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ప్రకటించాలని కోరారు.ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమ నాయకులు గట్ల రమ శంకర్, బాసిపంగు సునీల్, పడిదల ప్రసాద్, పంతం యాకయ్య, మామిడి శెట్టి అంజయ్య, ధరావత్ నాగేశ్వరావు, భారీ ఖాన్,నరబోయిన్ కిరణ్, కొలిక పంగు వాసు, పోరెళ్ల విప్లవ్ కుమార్, బాబా, దుబ్బ రమేష్, బొడ్డు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
సోమవారం | మార్చి 10, 2025 | www.navatelangana.com

ఐద్వా మండల,పట్టణ కమిటీల ఎన్నిక



నవతెలంగాణ-వలిగొండ

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా వలిగొండ మండల పట్టణ కమిటీలను శనివారం జరిగిన ఐద్వా జనరల్ బాడీ సమా వేశంలో జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ ప్రకటించారు.మండల కమిటీని 19 మందితో, పట్టణ కమిటీని 11 మందితో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా కర్నాటి మత్స్యారాణి, మండలకార్యదర్శిగా బూడిద మణెమ్మ,ఉపాధ్యక్షులుగా సిర్పంగి నిర్మల,మెట్టు లక్ష్మమ్మ, భూమి మాధవి, సహాయ కార్యదర్శులుగా దుబ్బలత, శీలం ఇందిర, గర్దాసు నర్మద,మండల కోశాధికారిగా కలుకూరి లక్ష్మమ్మలతో పాటు మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోగా వలిగొండ పట్టణ కమిటీ అధ్యక్షులుగా శీలం ఇందిర, కార్యదర్శులు గర్దాసు నర్మద, ఉపాధ్యక్షులుగా వేముల లలిత, ములుపోజు కవిత,సహాయ కార్యదర్శులుగా కూర మంగమ్మ,అపర్ణ, కోశాధికారిగా ద్యానబోయిన రేణుక లతో పాటు మరో నలుగురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

పెద్దమ్మ తల్లి బోనాల పండుగ వేడుకల్లో ప్రభుత్వ విప్

నవతెలంగాణ-మోటకొండూరు



మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో ముదిరాజుల ఆరాధ్యదైవం పెద్దమ్మ తల్లి బోనాల పండుగ వేడుకల్లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎల్లాంల సంజీవ రెడ్డి, మదార్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు, అనంతరం గ్రామస్తులు ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



హలో పద్మశాలి చలో హైదరాబాద్ సభకు తరలివెళ్లిన పద్మశాలీలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

హైదరాబాద్‌లో జరిగే 17 వ అఖిల భారత, 8 వ తెలంగాణ ప్రాంత పద్మశాలి మహాసభకు ఆలేరు పట్టణము, గ్రామాల నుండి 10 బస్సులలో, కార్లలో, వివిధ వాహనాలలో సుమారుగా 500 మంది బయల్దేరి వెళ్లారని, ఈ సభ పద్మశాలి కులస్తుల ఐక్యత చాట డానికి, రాజకీయ అవకాశాల లబ్ధికి ఉపయోగ పడుతుందని ఆలేరు పట్టణ పద్మ శాలి సంఘ ప్రధాన కార్యదర్శి చిక్క శ్రవణ్‌కుమార్ చెప్పారు.ఈ సందర్భంగా పద్మశ్రీ చింతకింది మల్లేశం మాట్లాడుతూ ఈ సభ పద్మశాలీలు రాజకీయం గా ఎదగడానికి, దేశ జనాభాలో వ్యవసాయం తరువాత అధికంగా ఆధారపడే రంగం చేనేత అన్నారు. అందులో గల సమస్యలను ప్రభుత్వంకు తెలియచేసి వివిధ పథకాలను అమలు పరుచుకొనే వీలవుతుందని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమం లో ఆలేరు పట్టణ గౌరవ అధ్యక్షులు బింగి నర్సింహులు, ఉపాధ్యక్షులు మెరుగు కృష్ణమూర్తి, కోశాధికారి చింతకింది ప్రకాష్ ,ఆలేరు మండల పద్మశాలి అధ్యక్షులు సామల సత్య ఋషి (టంగుటూరు) ప్రధాన కార్యదర్శి అంకం రాజు (కొలనుపాక), బడుగు జహంగీర్, వార్డు అధ్యక్షులు, పద్మ శాలి, చేనేత నాయకులు పాశికంటి ఉపేందర్, భోగ వెంకటాచలం, పాము మార్కండేయ, చింతకింది కృష్ణ, బేతి వెంకటేష్, గట్టు రాజు, చింతకింది సత్య నారాయణ, బేతి శ్రీనివాస్, రేగోటి వెంకటేష్, బిర్రు వెంకటేష్, గిరి ప్రసాద్, కిషోర్, మెరుగు శ్రీధర్ , గట్టు శ్రీనివాస్, చింతకింది మార్కండేయ, అమృతం నర్సింహులు, చిట్టిమిళ్ల వెంకటేష్, కటకం మల్లేష్, నర్సింగ రావు, నారాయణ సిద్దులు, కటకం సత్య నారాయణ, చిట్టిమిళ్ల సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన సాగునీటి ప్రాజెక్టులు చేపట్టాలి

- లింక్ రోడ్లను బీటీ రోడ్లుగా నిర్మించాలి
- గుజ్జలో సీపీఐ(ఎం) పోరుబాట
- నల్లగొండ,యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

గుజ్జ గ్రామం నుండి ఏపూరి వరకు,గుజ్జ నుండి చలిమెడ వరకు,గుజ్జ నుండి లింగ వారిగూడెం వరకు,గుజ్జ జిల్లా పరిషత్ హైస్కూల్ ముందు నుండి కోతులారం వరకు ఉన్న మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా నిర్మించాలని కోరుతూ ఆదివారం సీపీఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.గ్రామ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాలో సీపీఐ(ఎం) నల్లగొండ,యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం,జి శ్రీనివాసచారి మాట్లాడారు.కొన్నేండ్ల తరబడిగా ఈ లింకు రోడ్లను పాలకులు పట్టించుకో లేదన్నారు.దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.మునుగోడు నియోజకవర్గ ప్రజలకు సాగునీరు అందించేందుకు నిర్మించతలపెట్టిన డిండి ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం రూ.1886 కోట్లు నిధులు కేటాయించి డీపీఆర్‌ను ఆమోదించడం హర్షనీయమేనన్నారు.కేటాయించిన నిధులను విడుదల చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు.ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరందించాలని కోరారు.సాగునీటి వనరులు లేకపోవడం వల్ల ఈ ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయన్నారు.రైతులు సాగు చేసిన వరిపంటలు ఎండిపోతున్నాయన్నారు.ఎండిపోయిన వరిచేలను సర్వే చేసి నష్టపరిహారం ఇవ్వాలన్నారు.గుజ్జ గ్రామంలో పింఛన్ల కోసం143 మంది,రేషన్‌కార్డుల కోసం 213 మంది,ఇందిరమ్మ ఇండ్ల కోసం 614 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు.అర్హులందరికీ పథకాలు అందజేయాలన్నారు. గ్రామంలో మిగిలిపోయిన సీసీరోడ్లను,మురికికాలువలను నిర్మించాలన్నారు.ఆర్టీసి బస్సులు పునరుద్దరించాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దోడ యాదిరెడ్డి, మండల కమిటీ సభ్యులు కుకడాల మంగమ్మ,మాజీ సర్పంచ్ చాడ నరసింహ,ఉపసర్పంచ్ వేలిజాల గోపిక, నాయకులు బొమ్మగోని శంకరయ్య,మల్లె కృష్ణా రెడ్డి,దొడ సత్తిరెడ్డి,కొండవీటిపాపిరెడ్డి, మంగనర్సింహ, మార్త దామోదర్‌రెడ్డి,ఎలమందారావు,గంట లచ్చయ్య, నీలావతి,ప్రేమలత పాల్గొన్నారు.



ఆలేరులో...

రత్నాలవాగు, ఈదులవాగులపై హైలెవెల్ బిడ్జిల నిర్మాణం చేపట్టాలి

ఆలేరుటౌన్ : రత్నాల వాగు ఈదుల వాగులపై అయిల్ లెవెల్ బిడ్జిల నిర్మాణం పనులు చేపట్టాలని,సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తి చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరుబాట సందర్భంగా సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆలేరు పట్టణంలోని ఈదులవాగు- రత్నాలవాగులను పరిశీలించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం మాట్లాడుతూ నియోజకవర్గకేంద్రంగా ఉన్న పట్టణంలో ఆలేరు-బహదూర్ పేట మధ్యలో రత్నాల వాగు ఈదుల వాగులపై లో లెవెల్ కల్వర్టుల వలన వర్షాకాలంలో ఏ మాత్రం వరద వచ్చినా ఆలేరు నుండి మోటకొండూరు ఇతర మండలాలకు ప్రయాణ నిలిచిపోతుందని తెలిపారు. వెంటనే ఈదులవాగు-రత్నాల వాగులపై హై లెవెల్ బిడ్జిల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆలేరు పట్టణం నియోజకవర్గ కేంద్రం అయినప్పటికీ వర్షాకాలం వస్తే జాతీయ రహదారి తప్ప ఇతర మండలాలతో సంబంధాలు లేకుండా వరద దిగ్బంధనంలో పట్టణం ఉంటుందని వెంటనే హైలెవెల్ బిడ్జి నిర్మాణం చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలో మూడేండ్ల కింద కోట్లాది రూపాయలు విచ్చించి నిర్మాణం చేపడుతున్న సమీకృత కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయల ప్రజాధనం పెట్టి మార్కెట్‌ను పూర్తి చేయక పోవడం వల్ల సంవత్సరాల తరబడి ఉన్న కట్టడాలు శిధిలావస్థకు చేరే పరిస్థితి వస్తుందని చెప్పారు.ఆలేరు పట్టణ ప్రజల మౌలిక వసతుల కల్పన కోసం నిర్మించ తలపెట్టిన సమీకృత మార్కెట్ను వెంటనే పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు అసంపూర్తి నిర్మాణాలతో ఉన్న మార్కెట్ పరిసరాలను పరిశీలించి మార్కెట్ నిర్మాణం పూర్తి చేయడం కొరకు స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి నాయకులు మొరిగాడి రమేష్, మొరిగాడి చంద్రశేఖర్, వద్దేమాన్ బాలరాజు ,రాజేష్,మొరిగాడిలక్ష్మణ్, గనగాని రాజు, సాయినికళ్యాణ్, సకినాల సిద్ధిరాములు, వెంకటేశం,లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సంస్థాన్‌నారాయణపురంలో..



బీడు బారుతున్న పచ్చని పంట పొలాలు

- అప్పుల్లో రైతులు

నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్

చౌటుప్పల్ మండలం మందోళ్లగూడెం గ్రామపంచాయతీలో ఎండిన వరిపంటలను బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం పరిశీలించారు.వల్లూరి శ్రీను,వల్లూరి వెంకటయ్య,నెట్టు లింగయ్య,వల్లూరి శ్రీశైలం రైతుల ఎండిన వరి పంటలను పరిశీలించారు.చౌటుప్పల్ మండలంలో భూగర్భ జలాలు అడుగంటడంతో,చేతికోచ్చే వరి పంటలను గొర్రెలు,మేకలకు మేపుకోవాల్సి దుస్థితికి వస్తుందని ఆరో పించారు.కొద్ది దూరంలో పిలాయిపల్లి మూసి కాలువ వెళుతున్న ఈ ప్రాంత రైతులకు ఉపయోగం లేకుండా అయిపోయిందని దుయ్య బట్టారు. మును గోడు నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ దూల భిక్షంగౌడ్, మండల అధ్యక్షులు కైరంకొండ అశోక్ మాట్లాడుతూ స్థానిక అధికారులు మండలంలోని అన్ని గ్రామాలలో ఎండుచున్న వరి పంటలను సందర్శించి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేసి రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. కిలోమీటర్ దూరం నుండే మూసీ పిలాయిపల్లి కాలువ నీటిని ఈ గ్రామ రైతులకు తక్షణమే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో నాయకులు ఊడుగు యాదయ్య గౌడ్ చినుకని మల్లేశం యాదవ్ కట్ట కృష్ణ,సత్తయ్య,కాయితి ముత్యాలు తేలుకుంట్ల శ్రీధర్,పబ్బు వంశీ,బాతరాజు సైదులు,వికాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థానాలకు ఎదగాలి

- పూర్వ విద్యార్థి మాదిరెడ్డి మాధవరెడ్డి
- సర్వేలు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

మండలంలోని సర్వేలు గురుకుల పాఠశాలలో అత్యధికమార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు 1989 బ్యాచ్ కు చెందిన మాదిరెడ్డి మాధవరెడ్డి తన తండ్రి మాదిరెడ్డి గణపతిరెడ్డి జ్ఞాపకార్థం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.ఈ ప్రోత్సాహకాలను ఆదివారం పలువురు పూర్వ విద్యార్థులతో కలిసి తల్లి మాదిరెడ్డి సుమన చేతుల మీదగా అందజేశారు.1989 బ్యాచుకు చెందిన సర్వెల్ పూర్వ విద్యార్థి మాదిరెడ్డి మాధవరెడ్డి సర్వేలు గురుకులంలో మెరిట్ సాధించిన విద్యార్థులకు గత ఐదేండ్లుగా నగదు ప్రోత్సాహం అందజేస్తు న్నారు.ఆయన వర్జీనియా,లౌడౌన్ కౌంటీ,డల్లెస్ జిల్లా ప్రణాళిక కమిషనర్‌గా పనిచేస్తున్నారు.ఆదివారం నిర్వహించినఈ ఏడాది స్కాలర్‌షిప్‌లను సర్వేలు గురుకులంలో మొదటి ర్యాంక్ సాధించిన ఎస్.నందకుమార్‌కు రూ. 25,000లు, రెండవ ర్యాంక్ సాధించిన ఎస్. సాత్విక్ కు రూ.15,000లు,మూడవ ర్యాంక్ సాధించిన ఆర్.శ్రీదత్‌కు రూ.10వేలు మరో 8మంది కూడా విద్యార్థులకు రూ.1000 చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమానికి అలుమ్ని అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జి.వి.రమణారెడ్డి,అసోసియేషన్ నాయకులు రాజశేఖర్ రెడ్డి,మల్లేశం,1989 సంవత్సరపు పూర్వవిద్యార్థులుఎస్.మహేశ్వర్,పి.శ్రీనివాస్,సిహెచ్ వివేక్,పురుషోత్తంరెడ్డి, చాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ప్రస్తుతం మెరిట్ సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ రకమైన కార్యక్రమాలు గొప్ప అవకాశాలను కల్పిస్తాయన్నారు.



బొజ్జరమేశ్ కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-మోటకొండూరు



మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొజ్జరాంచందర్ మోట కొండూరు మండల ఈనాడుపత్రిక విలేకరి బొజ్జ రమేష్ తల్లిబొజ్జచంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆదివారం చంద్ర మ్మ దశదిన కర్మలో పాల్గొని చిత్రపటానికి నివాళు లర్పించారు. కుటుంబసభ్యులను కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎల్లాంల సంజీవరెడ్డి పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో అమ్మనబోలు కాంగ్రెస్ గ్రామశాఖఅధ్యక్షులు శీల బాలకృష్ణ, గ్రామనాయకులునల్లమాస విశ్వనాథం, రాంరెడ్డి, జక్కుల జీరంజీవి,తదితరులు పాల్గొన్నారు.

11న భువనగిరి కలెక్టరేట్ ముందు ధర్నాను జయప్రదం చేయండి

నవతెలంగాణ-వలిగొండ

పాల రైతుల మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందాడి సత్తిరెడ్డి పిలుపునిచ్చారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ 85 కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు.మదర్‌డెయిరీ ఆస్తులు అమ్మొద్దు పాలరైతులను ప్రభుత్వం గ్రాండ్స్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. మండలంలోని వెలువర్తి, సుంకిశాల, గోలిగూడెం, పులిగిల్ల గ్రామాలలో పర్యటించి కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను ఆయా ఉత్పత్తిదారుల సహకార సంఘాల చైర్మెన్లు ఉత్పత్తిదారులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు వాకిటి వెంకట్రెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కొండే కిష్టయ్య కలుకూరు ముత్యాలు ఆయా సంఘాల చైర్మెన్లు బూడిది పాపయ్య, బూడిది లక్ష్మయ్య, తుమ్మల సత్యనారాయణరెడ్డి, కొలనుఆదిరెడ్డి,పార్వతంశ్రీశైలం,అశోక్,ఆయాసంఘాల పాలఉత్పత్తిదారులు పాల్గొన్నారు.





దేవరకొండ సత్తయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-మోటకొండూరు

మండలంలోని మాటూరు గ్రామానికి చెందిన దేవరకొండ సత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబసభ్యులను కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎల్లాంల సంజీవరెడ్డి పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాటూరు గ్రామశాఖ అధ్యక్షులు ఆనంతుల లక్ష్మారెడ్డి,గ్రామ మాజీసర్పంచ్ జెన్నె సిద్దులు,గ్రామ కాంగ్రెస్‌నాయకులు,బైరపాక పరుశరాములు, ఉప్పలయ్య యూత్ కాంగ్రెస్ నాయకులు కుమారస్వామి, బైరపాక సతీష్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట స్వామివారిని అవమానపర్చిన మంత్రులు



- స్వామి కల్యాణోత్సవానికి రాకపోవడం సిగ్గుచేటు
- స్వామి వారి మీద ప్రభుత్వానికి భక్తి లేదు
- బీఆర్ఎస్ మండలఅధ్యక్షులు కర్రె వెంకటయ్య

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవ కల్యాణానికి రాష్ట్ర మంత్రులు రాకపోవడం స్వామివారిని అవమాన పరచడమేనని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఆరోపించారు.అదివారం గుట్టలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో యాదగిరిగుట్ట స్వామి వారిని తీవ్ర అవమానం జరుగుతుందన్నారు.గుట్ట అభివృద్ధికి ఒక్కపైసా నిధులు కేటాయించపోగా స్వామి ఉత్సవాలలో అవమాన పరిచే విధంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఈఓ భాస్కర్‌రావు వ్యవహరిస్తున్నారని తెలిపారు. శనివారం జరిగిన తిరుకల్యాణోత్సవంలో ప్రభుత్వం తరపున అందజేసే ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పణలో బీర్లశంకర్, ఈరసారపు యాదగిరిగౌడ్ ఏహోదా లో పాల్గొన్నారో చెప్పాలన్నారు. ప్రతి సారి పట్టువస్త్రాలు స్వామి వారికి సమర్పించే క్రమంలో మండపంపై కాకుండా అర్చకులు కిందికి దిగి స్వీకరిస్తారని తెలిపారు. కానీ ఇందుకు విరుద్ధంగా స్వామి వారి మండపాన్ని ఎక్కి ఇవ్వడం పట్ల భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఉందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్‌పాలనలో స్వామి వారి కల్యాణానికి ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి, ఇతర జిల్లా మంత్రులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించేవారన్నారు.కానీ ఈసారి కల్యాణం మాత్రం మంత్రులు లేకుండా జరిగిందన్నారు.ఇది స్వామివారిని అవమానించడమేనని తెలిపారు.ఈ కార్యక్రమంలో నార్మూల్ మాజీ చైర్మెన్ లింగాల శ్రీకర్ రెడ్డి, పాలసంఘం చైర్మెన్ మారెడ్డి కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుణగంటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-వలిగొండ రూరల్

మండలంలోని రెడ్లరేపాకు చెందిన జువ్వగాని శ్రీనుగౌడ్ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. మృతునితో వలిగొండ ప్రభుత్వ పాఠశాలలో 10 వ తరగతి చదువుకున్న చిన్ననాటి మిత్రులు ఆదివారం కుటుంబసభ్యులను పరామర్శించి వారికి రూ.61 వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో సయ్యద్ సలీమ్‌పాషా, ఎడవెల్లి అనిల్, పోతుగంటిశేఖర్, కాసుల సంజీవ, రాస శ్రీశైలం, దండ శ్రీను, చిర్ర చంద్రి, దేశపాక అశోక్, వడ్డేపల్లి విజయ్, కొల్లోజు శ్రీనివాస్, గోపగోని వెంకటెష్, పాల్వంచ గణేష్, సిరికొండ శ్రీను, దేశపాక సుదర్శన్, దంతూరి విజయ్, దంతూరి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రాచకొండలో రిజర్వాయర్‌ను నిర్మించాలి

- రైతుసంఘం జిల్లా నాయకులు దోనూరి నర్సిరెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

రాచకొండలో తక్షణమే రాచకొండ రిజర్వాయర్ నిర్మించాలని రైతు సంఘం జిల్లా నాయకులు దోనూరి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం చౌటుప్పల్ కందాల రంగారెడ్డి భవనంలో విలేకరుల సమావేశంలో నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న మునుగోడు నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి ఉందని నర్సిరెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.రాచకొండ రిజర్వాయర్ ద్వారా ఆ ప్రాంతం వేల ఎకరాలు సాగులోకి తీసుకురావొచ్చన్నారు.నక్కలగండి ఎత్తిపోతల పథకం దశాబ్దాలుగా నత్తనడకన పనులు సాగుతున్నా యన్నారు.చర్లగూడెం రిజర్వాయర్‌ను తక్షణమే పూర్తి చేసి మునుగోడు నియోజకవర్గాన్ని సాగునీరుతో సస్యశ్యామలం చేయాలన్నారు.చర్లగూడెం రిజర్వాయర్ నుండి నారాయణపురం మండల కేంద్రంలో జానకమ్మ చెరువులోకి నీళ్లు నింపినట్లైతే కింది ప్రాంతమైన గ్రామాల చెరువులలో నీళ్లు నింపవచ్చన్నారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చర్లగూడెం రిజర్వాయర్ ని కూర్చి వేసుకొని పూర్తి చేయిస్తానని చెప్పి ఇప్పటివరకు రిజర్వాయర్ పూర్తి కాలేదని విమర్శించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో మునుగోడు నియోజవర్గం ఎడారిగా మారే పరిస్థితి ఏర్పడిందని దోనూరి నర్సిరెడ్డి తెలిపారు. వ్యవసాయామే జీవనాధారంగా భావించి ఈ ప్రాంత రైతులు వ్యవసాయమే దండుగా అనే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.రైతులు,కార్మికులు ఈ ప్రాంతాన్ని వదిలిపెట్టి హైదరాబాద్‌లో ఆటోలు,అపార్ట్మెంట్లలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారని తెలిపారు.మూసీకాలువ చౌటుప్పల్ మండలాన్ని ఆనుకునే వెళ్తున్న చౌటుప్పల్ ప్రాంతా రైతులకు అందే పరిస్థితి లేదని తెలిపారు.మూసీ కాల్వను దండుమల్కాపురంలో మైసమ్మకత్వ వద్ద లిఫ్టు చేసి మల్కాపురం చెరువులను నింపినట్లైతే దేవలమ్మ నాగారం తంగడపల్లి ఇతర గ్రామాలకు సాగునీరు అందుతుందని తెలిపారు.సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ మూసీ కాలువ వెడల్పును పెంచి చౌటుప్పల్ మండలంలో చెరువులను నింపి కరువు నుండి రైతులను కాపాడాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు గుంటూజు శ్రీనివాస్‌చారి, రాగిరి కిష్టయ్య నారాయణపురం పీఏసీఎస్‌చైర్మెన్ దొడ యాదిరెడ్డి, రైతుసంఘం నాయకులు తుమ్మలనర్సిరెడ్డి,చీర్క సంజీవరెడ్డి,అలివేలు,బొజ్జబాలయ్య,కొండే శ్రీశైలం,బోయ యాదయ్య పాల్గొన్నారు.



'వానాకాలం ధాన్యానికి బోనస్ చెల్లించాలి'



నవతెలంగాణ-దామరచర్ల

రైతులకు వానాకాలం పండించిన పంటకు ప్రభుత్వం చెప్పినట్టుగా బోనస్ చెల్లించాలని సీపీఐ(ఎం) దామరచర్ల శాఖ కార్యదర్శి బి దయానంద్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) పిలుపు మేరకు ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) పోరుబాటలో భాగంగా దామరచర్ల మండల కేంద్రంలో ప్రజా సమస్యలపై ఆదివారం సర్వే నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు రైతుబంధు, రుణమాఫీ కొంతమందికి మాత్రమే పడ్డాయని చెప్పారు. మరి కొంతమందికి ఇంకా రావాల్సి ఉన్నదని చెప్పారు. వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు.అదేవిధంగా రైతులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ భూములకు నిరుపేదలైనటువంటి పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లు త్వరగా మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు ఉన్నవారికి ఇండ్లు కట్టుకోవడానికి కావలసిన సహాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ఉపాధ్యక్షుల షేక్ సుభాని ,శాంతమ్మ, రామ్ రెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో బర్నింగ్‌పాయింట్ ఏర్పాటు

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి పట్టణంలోని తాతానగర్‌లో జెర్రిపోతుల ప్రసాద్ జ్ఞాపకార్థంగా దాదాపు రూ.5 లక్షల వ్యయంతో కాష్టం, మండపం ఏర్పాటుకు జెర్రిపోతుల అజయ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు.ఈ సందర్భంగా ఆదివారం పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఈ పనులకు సహకరిస్తున్న వార్డు ప్రజలకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ సతీష్‌లక్ష్మి, అజయ్‌కుమార్, వినీత, జాగృతి, సాహిత్య, ప్రవళిక, వడిచర్ల కృష్ణయాదవ్, గుర్రాల శ్రీనివాస్, బలరాం శ్రీను, అంజయ్య, సత్యనారాయణ, నాగులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి

నవతెలంగాణ-మిర్యాలగూడ

మహిళలు అన్ని రంగాలలో రాణించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. ఆదివారం స్థానిక హౌసింగ్ బోర్డు లో ఐద్వా, మహిళ రైతు సంఘం ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం సందర్భంగా మహిళలు సన్మానించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలబోయిన వరలక్ష్మి మాట్లాడుతూ మహిళకు చట్టసభలో 33శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమాజంలో మహిళలకు సమానత్వం అందించాలని కోరారు. మహిళలు అన్ని రంగాలలో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళల హక్కుల సాధన కోసం ఐద్వా పోరాటం చేస్తుందని చెప్పారు. మహిళలు ఐక్యంగా ఉండి సమస్యల సాధన కోసం పోరాడాలన్నారు.



ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు మనుల అరుణ, జిల్లా సహాయ కార్యదర్శి గోవర్ధనా, మహిళా రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఊర్మిల, మున్ని పాల్గొన్నారు.

మార్కండేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-చండూరు



స్థానిక శ్రీమార్కండేశ్వర, శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల భాగంగా ఆదివారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకుని, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మునుగోడు నియోజక వర్గం ప్రజలు సుఖ సంతోషాలతో, పాడిపంటలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. కర్నాటి విద్యాసాగర్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ చండూరు పట్టణ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్,ట్రమ్మ జిల్లా అధ్యక్షులు కోడి శ్రీనివాసులు, దోటి వెంకన్న, కారింగు రామూర్తి, మంచుకొండ సంజయ్, నల్లగంటి మల్లేష్, గుండూరి జనార్దన్, భూతరాజు దశరథ,మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సర్వీస్ రోడ్డు తొందరగా పూర్తి చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

సీపీఐ(ఎం) చేపట్టిన స్థానిక సమస్యలపై ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ సర్వీస్ రోడ్డు పనులు నత్త నడకన కొనసాగుతున్నవి ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాంట్రాక్టు రోడ్డు 15 ఫీట్లు వెడల్పు వేయాల్సి ఉన్నది కానీ దాన్ని 12 ఫీట్లకే కుదించారన్నారు.డ్రయినేజీ మిషన్ భగీరథ వాటర్‌లైన్ పైన కట్టారన్నారు.పైప్‌లైన్ పగిలి గ్రామస్తులకు మంచినీటి సరఫరా కాక ఇబ్బంది పడుతున్నారన్నారు. రోడ్డు తోవడం వల్ల ఇప్పటికి ముగ్గురు కాలు జారి పడ్డారన్నారు.రోడ్డు పనులు మొదలుపెట్టి దాదాపు నాలుగు నెలలు కావొస్తుందన్నారు.ఇప్పటికైనా కాంట్రాక్టు అధికారులు స్పదించి రోడ్డు మరమ్మతులు తొందరగా చేపట్టాలని డిమాండ్ చేశారు. అట్లాగే గ్రామంలో ఉన్న281 సర్వేనెంబర్ ప్రభుత్వభూమిలో ఇండ్లు లేని పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు కుమ్మరిశంకర్, దండురవి, బొల్లెటద్దు సైదులు, శాఖ కార్యదర్శులు దండు నాగరాజు, దండు శ్రీను, బొంగు లింగయ్య కత్తుల రవి, బొడ్డుపలి శంకరయ్య, సూర ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

నాట్కో క్యాజువల్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలి



నవతెలంగాణ-నాగార్జునసాగర్

నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్‌లోని నాట్కో ఫార్మా కంపెనీలో 10సంవత్సరాలుగా పనిచేస్తున్న క్యాజువల్ కార్మికులని తక్షణమే పర్మనెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అవుతా సైదులు, జిల్లా నాయకులు ఎస్‌కె. బషీర్ డిమాండ్ చేశారు. ఆదివారం నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్‌లో సీఐటీయూ కార్యాలయంలో నాట్కో ఫార్మా కంపెనీ క్యాజువల్ పర్మనెంట్ కార్మికుల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మూడు సంవత్సరాల సర్వీస్సున్న క్యాజువల్ మరియు కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేసి వారికి పిఎఫ్, ఇఎస్ఐ ఇతర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలన్నారు. కేంద్ర ,రాష్ట్ర పాలకులు కార్మికులను విభజించి పాలిస్తున్నారని కార్మికుల జెండాలు వేరైనా కార్మికుల అజెండా ఒకటే అనే పద్ధతిలో కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి ఐక్య ఉద్యమాలు నడపడంలో సీఐటీయూ ముందుందని తెలియజేశారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో, పరిశ్రమలలో కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు విధంగా పాలక ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రేబెల్లి వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, అనిల్, కత్తి శీను, నాగరాజు, రాము, శ్రీను, రవి పాల్గొన్నారు.

'గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి'

నవతెలంగాణ-త్రిపురారం

ఆదివారం త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామంలో సీపీఐ(ఎం) పోరుబాట పేరుతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే చేపట్టినట్టు మండల పార్టీ కార్యదర్శి దైద శీను తెలిపారు. కంపసాగర్ గ్రామ పజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ముకుందాపురం నుండే కంపసాగర్ కు రావడాని ఆర్ అండ్ బి లింకు రోడ్డు మొత్తం పూర్తిగా ధ్వంసమై గుంతలు, రాళ్లు తేలి నడవడానికి, బైక్‌పై ప్రయాణం చేయడం నానా ఇబ్బందులు పడుతున్నట్లు వృద్ధ వివిధ గ్రామాలకు వెళ్లి రావాలి అంటే నడిచే పరిస్థితి లేదని అన్నారు. ఆ రోడ్డు నిర్మాణం చేపట్టే వరకు. పోరాటం చేపట్టేలా కార్యాచరణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో ప్రజల అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలనీ డిమాండు చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు కొప్పు వెంకన్న, వల్లపు వెంకటయ్య, కందిమళ్ళ వీరారెడ్డి, అల్లంపల్లి మంగమ్మ, చంద్ర కళ పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిని ఎంచుకోవాలి

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

యువత స్వయం ఉపాధిని ఎంచుకోవాలని ఖమ్మం జిల్లా అడిషనల్ డిస్టిక్ అండ్ స్టేషన్ జడ్జి వసుకుల శ్రీనయ్య అన్నారు. ఆదివారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొత్త బావి స్టేజి వద్ద నూతనంగా ఏర్పాటు చేసినటువంటి మన ఊరి హోటల్ పసునూరి యుగంధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతోపాటు ఉద్యోగాలకు పోటీపడుతూ వృధాగా ఉండకుండా ఏదో ఒక స్వయం ఉపాధి పనిని ఎంచుకోవడం మంచిదని అన్నారు. ఈ ఆర్ దసురు నాయక్, మారం నారాయణ రెడ్డి, మాడుగుల యాదగిరి, వెంకటయ్య బొడ్డుపల్లి దశరథం, జితేందర్, సత్యం వెంకటయ్య, మల్లేష్, నిర్వాహకులు లక్ష్మణ్ పాల్గొన్నారు.



సెల్ టవర్ల రిమోట్ యూనిట్ల దొంగల అరెస్టు

నవతెలంగాణ-నాగార్జునసాగర్

ఎయిర్టెల్, బీఎస్ఎన్ఎల్ టవర్లలో రేడియో రిమోట్ యూనిట్లను బేస్ బాండ్ యూనిట్లను దొంగలిస్తున్న దొంగల ముఠాను నల్గొండ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నాగార్జునసాగర్ పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాగర్ సిఐ బీసన్న మాట్లాడుతూ గత కొంతకాలంగా పెద్దవూర, తిరుమలగిరి సాగర్, హాలియా, నరసరావుపేట పరిధిలో పలు ఎయిర్టెల్, బీఎస్ఎన్ఎల్ టవర్లకు సంబంధించిన 5 జి సిగ్నల్ కోసం బిగించే రేడియో రిమోట్ యూనిట్లను, బేస్ బాండ్ యూనిట్ను దొంగలించి హైదరాబాదులో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్న ముఠాలోని సభ్యులను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లుగా తెలిపారు. తిరుమలగిరి సాగర్ మండలం జానారెడ్డి కాలనీకి చెందిన జటావత్ మహేష్ అలియాస్ మహేష్ బాబు, జటావత్ నాగేష్, జటావత్ వినోద్‌లు సెల్ టవర్లకు సంబంధించి రేడియో రిమోట్ యూనిట్లను, బేస్ బాండ్ యూనిట్లను దొంగలించి హైదరాబాద్ నాంపల్లిలో మాలిక్ అనే వ్యక్తికి అమ్మకం చేయటానికి తీసుకు వెళుతుండగా పెద్దవూర మండలం పోతునూరు టోల్ గేట్ దగ్గర సీఐ బీసన్న, పెద్దవూర ఎస్ఐ వీరబాబు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు. వీరిని విచారణ చేయగా పెద్దవూర మండల పరిధిలో రెండు సెల్ టవర్లు ,తిరుమలగిరి సాగర్ మండల పరిధిలో ఒక సెల్ టవర్, హాలియా మండల పరిధిలో ఒక సెల్ టవర్ ,నరసరావుపేట రూరల్ పరిధిలో మరో సెల్ టవర్లకు అమర్చిన రేడియో రిమోట్ యూనిట్లను, బేస్ బాండ్ యూనిట్లను దొంగలించి అమ్మినట్లుగా ఒప్పుకున్నట్లుగా తెలిపారు. వీరి నుండి దొంగలించిన సెల్ టవర్ సాంకేతిక పరికరాలతో పాటు లక్ష 50 వేల రూపాయల నగదును స్వాధీన పరుచుకున్నట్లుగా తెలిపారు. ఇట్టి కేసులో ప్రతిభ కనబరిచిన మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజుని సాగర్ సర్కిల్ సీఐ బీసన్నను, పెద్దవూర ఎస్ఐ వీరబాబును, హెడ్ కానిస్టేబుల్ ఈదయ్యను సిబ్బంది లోకేష్ రెడ్డి, యాదయ్య ,శ్రీకాంత్ ,వెంకట్రాంరెడ్డి లను జిల్లా ఎస్పీ అభినందించారు.

మహా ధర్నాను జయప్రదం చేయండి

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్

మదర్‌డెయిరీ ఆస్తులను అమ్మొద్దని,పాల రైతులను ప్రభుత్వం గ్రాంట్స్ ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడెం,బస్వాపురం గ్రామాలలోని పాల సహకార సంఘాల వద్ద పాల రైతుల ధర్నా నీ జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రం విడుదల చేసి మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని మదర్‌డెయిరీకి చెందిన పాలరైతులకు 6 పాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని,విజయ డైరీ కి చెందిన పాల రైతులకు అక్టోబర్ ,నవంబర్ మరియు ఫిబ్రవరికి సంబంధించిన 2 బిల్లులు మొత్తం 4బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే పెండింగ్ పాల బిల్లులని చెల్లించాలని డిమాండ్ చేశారు. మదర్‌డెయిరీ పరిధిలోని 24చిల్లింగ్ సెంటర్స్ 435 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు సుమారు 50,000 వేల కుటుంబాల ద్వారా రోజుకు 1,15000 లీటర్ల పాలు సేకరిస్తున్నారని,విజయడెయిరీ పరిధి లో 5000 వేలకు పైగా పాల ఉత్పత్తి దారుల సహకార సంఘాల నుండి సుమారు 70,000 కుటుంబాల ద్వారా రోజుకు 3,50,000 లీటర్ల పాలను సేకరిస్తున్నారన్నారు.మదర్‌డెయిరీ పరిధిలో పాల రైతులకు 25 కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులు ఉన్నాయని తెలిపారు.34కోట్ల రూపాయిల సంస్థ అప్పుల్లో కూరుకు పోయిందన్నారు.నష్టాల్లో నడుస్తున్న సంస్థను గట్టెకించాలంటే సంస్థ ఆస్తులను అమ్మి అప్పులు తీరుస్తామని మదర్‌డెయిరీ చైర్మెన్ ప్రకటించడం అన్యాయమని తెలిపారు.ప్రభుత్వం పాలరైతులకు గ్రాంట్స్ ఇచ్చి ఆదుకోవాలని, మార్చి 11న భువనగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే పాల రైతులధర్నాలో వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కొండ అశోక్,మచ్చ భాస్కర్, ముత్తిరెడ్డి గూడెం మదర్‌డెయిరీ చైర్మెన్ గౌరయ్య కార్యదర్శి రాంపల్లి కృష్ణ, బొడు సత్యనారాయణ, కొండస్వామి, రాంపల్లి బక్కయ్య, కొండ మడుగు రాములు.గౌరయ్యా, కొండ మహేశ్వరి, కొండ పాండు, ఉడుత లక్ష్మి, బస్వాపురం మదర్‌డెయిరీ చైర్మెన్ కస్తూరిపాండు, కార్యదర్శి రాసాల సుధాకర్, డైరెక్టర్ రాసాలచిత్తారి, రాంపల్లి సత్యనారాయణ, కడారి ఐలయ్య, రాసాల వెంకటేష్, ఉడుత ప్రవీణ్,గౌలికార్ హరిలాల్, అర్మల్ల మల్లేశం,నోముల బాలరాజు, ఉడుత దశరథ్.ముదిగొండ లక్ష్మణ్, బస్వాపురం విజయ్‌డెయిరీ చైర్మెన్ కోయగూర మల్లిఖార్జున్, బొజ్జ వెంకటేషం, నరాల చంద్రయ్య, మచ్చ శివ శంకర్, నోముల లక్ష్మినారాయణ, ఉడుత కరుణాకర్, పూసవెంకటేశం, రాసాల దేవేందర్, గాండ్ల నర్సింహ, పాల రైతులు పాల్గొన్నారు.



మహిళలు అన్ని రంగాలలో సమానత్వం కోసం పోరాడాలి



నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

మహిళలపై రోజురోజుకు అన్ని రకాలుగా హింస, దాడులు, అనిచివేత పెరుగుతున్నాయని వీటికి వ్యతిరేకంగా మహిళలు పోరాడుతూ, అన్ని రంగాలలో సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వం కోసం పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకులు బేజాడి వినోద పిలుపునిచ్చారు. శనివారం, యాదగిరిగుట్ట మండలం కాచారం, అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా గ్రామంలో మహిళలతో గ్రూప్ మీటింగ్స్, కరపత్రాలతో ప్రచారం, సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద పాల్గొని మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా శ్రామిక, పీడిత మహిళలందరూ ఈరోజు మాది అని ఆత్మవిశ్వాసంతో ప్రకటించుకున్న రోజే అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం మార్చి 8 అని అన్నారు. పోరాడే మహిళలందరూ తమ పోరాటాలను సమీక్షించుకొని, ఒకరికొకరు సంఘీభావం తెలుపుకునే అత్యంత గొప్పదినం ఈరోజేనని తెలిపారు.కానీ కొంతమంది స్వార్థపర శక్తులు మహిళల్ని రంగాలలో కొన్ని వేల సంవత్సరాల నుండి వెనుకబాటుకు కారణమైన వారే నేడు వాళ్ళే శాలువాలు కప్పుతూ సన్మానాలు చేస్తూ, విందు విలాసాలు చేస్తూ ఇదే గొప్ప దినంగా ప్రకటించుకోవడం సరికాదన్నారు. అన్ని రంగాలలో మహిళలకు సమాన హక్కులు కల్పిస్తూ పని ప్రదేశాలలో వేధింపులు, అణిచివేతలు లేకుండా ఉన్నప్పుడే స్త్రీ, పురుష సమానత్వం సాధ్యమవుతుందని అన్నారు. పురాణాలు, వేదాలు, మన ధర్మ శాస్త్రాలు అనేక సంవత్సరాల నుండి మహిళలని చిన్న చూపుకు గురిచేస్తూ ఆచారాల పేరుతో అణిచివేశారని, వీటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు బండారు మణెమ్మ, ఎండి సర్దార్, ఇప్ప యాదమ్మ, ఒగ్గు సత్తెమ్మ బేజాడి పద్మ , బేజాడి హేమలత, మహంకాళి ఋతు, ఒగ్గు లత, ఎండి పర్దాన బేగం, సుంచు విమల, ఎండి జరీనా బేగం, సుంచు యశోద, స్ఫూర్తి, ఆజాద్, భాను, ఊర్విజ, సహస్ర, చిన్నారి విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య సృజనలో మేటి తూర్పు మల్లారెడ్డి

ఆచార్య లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-భువనగిరి

తెలుగు సాహిత్య సృజనలో తనదైన ప్రతిభను చాటుతూ వచ్చే తరాలకు మార్గదర్శిగా నిలిచిన గొప్ప కవి డాక్టర్ తూర్పు మల్లారెడ్డి అని విశ్రాంత ఆంగ్లాచార్యులు ఆచార్య లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం భువనగిరి ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో జరిగిన డాక్టర్ తూర్పుమల్లారెడ్డి శతకం శ్రీ యాదగిరి నరసింహ శతకం ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేసి ప్రసంగించారు. తెలుగు భాషా సాహిత్యాల బోధనలో తన విద్యార్థులను గొప్పగా తీర్చి దిద్దిన ఘనత మల్లా రెడ్డిది అన్నారు. కవిత్వం రాసినా,విమర్శ చేసినా, ఉపన్యాసం ఇచ్చినా అందులో ఆయన ప్రత్యేకత ఉంటుందన్నారు.కళాశాల గౌరవ కార్యదర్శి డాక్టర్ టి.ఎస్.వంశ తిలక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎన్.శ్రీనివాస్,శతావధాని డాక్టర్ మలుగఅంజయ్య, ప్రఖ్యాత పద్యకవులు దోరవేటి చెన్నయ్య,డాక్టర్ నలవోలు నరసింహారెడ్డి,దేవినేని అరవిందరాయుడు, వాకిటి రాంరెడ్డి, గుమిడెల్లి వెంకన్న, రెబ్బ మల్లికార్జున్, విశ్రాంత ప్రధానాచార్యులు శ్రీనివాస్,రాజనీతి శాస్త్ర ఉపన్యాసకులు బుచ్చయ్య,సామమల్లారెడ్డి ,కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పద్యకవితా పఠనం నిర్వహించారు..ఇందులో పాలకుర్తి రామమూర్తి, బండిరాజులశంకర్, మెరుగుమల్లేశం,గోధుమకుంట పోచయ్య,దేవినేని అరవింద రాయుడు,డాక్టర్ పాండాల మహేశ్వర్‌గౌడ్,శిఖ గణేష్, గుమిడెల్లి వెంకన్న,రాపోలు అరుణాస్వామి కవితా పఠనం చేశారు.పద్య కవులను ఘనంగా సన్మానించారు..



అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



- సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఆయూబ్

నవతెలంగాణ-మిర్యాలగూడ

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు వర్తింపచేసి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఆయూబ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీతారాంపురంలో ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అనేక హామీ ఇచ్చి ఓట్లు వేయించుకుందని ఇప్పుడు అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అందించాలని, గ్యాస్ సబ్సిడీ ఇవ్వాలని, కొత్త రేషన్ కార్డులు ఇచ్చి వెంటనే సన్న బియ్యం ఇవ్వాలన్నారు. హామీల అమలు కోసం సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈనెల 24 నుంచి 26 తేదీల వరకు మిర్యాలగూడలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామని తెలిపారు. పేదలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుంటోజు వీరాచారి, లక్ష్మీ నారాయణ, గుంటోజు విష్ణు, గోవర్ధనా, భాస్కర్, నాగేశ్వరి, లింగమ్మ, రేణుక, అచ్చయ్యపాషా, రషీద్, షఫీ, బాబా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

గురవయ్య గౌడ్ మృతి బాధాకరం

- మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

నవతెలంగాణ-చింతపల్లి

మండలంలోని పోలేపల్లి రాంనగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఊకోండి యాదగిరి గౌడ్ తండ్రి ఊకోండి గురవయ్యగౌడ్ మృతి బాధాకరమని బీఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన దేవరకొండ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఆదివారం పోలేపల్లి రాంనగర్ గ్రామంలో గురవయ్యగౌడ్ మృత దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం గురవయ్యగౌడ్ కుటుంబ సభ్యులకు ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గురవయ్యగౌడ్ ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతుని ప్రార్థించారు. గురవయ్యగౌడ్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట ముద్దు జోగయ్యగౌడ్, మర్రిగూడ మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య గౌడ్, (జర్నలిస్ట్) మొగుతాల శంకర్ గౌడ్, ఊకోండి బ్రదర్స్ ఉన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థిగా శంకర్ నాయక్ పేరు ఖరారు

నవతెలంగాణ-మిర్యాలగూడ



నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేతవత్ శంకర్ నాయక్‌ను శాసనసభ కోటా నుండి జరిగే శాసనమండలి సభ్యుల పోటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నిర్ణయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రకటించారని టిపిసిసికి పంపిన లేఖలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆయనతో పాటు ఎస్సీ నుండి అద్దంకి దయాకర్, బిసి నుండి సిని నటి విజయశాంతిలను అభ్యర్థులుగా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఒక స్థానాన్ని సీపీఐకి అధిష్టానం కేటాయిస్తున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గంలోని దామరచర్లలోనీ డిలావర్ పూర్ గ్రామపంచాయతీ నవంబర్ 15, 1972లో జన్మించారు. ఆయన తండ్రి వీర్యనాయక్ ఆ గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. శంకర్ నాయక్ యువజన కాంగ్రెస్ కార్యకర్తగా రాజకీయాల్లో అడుగు పెట్టి 1998 నుండి 2001 వరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 2001 నుండి2005 వరకు ఉమ్మడి దామరచర్ల మండల జెడ్పీటీసీగా, 2006 నుండీ 2011 వరకు దామరచర్ల మండల పరిషత్ అధ్యక్షుడిగా, 2011 నుండి 2014 వరకు దామరచర్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, 2016 నుండీ 2019 వరకు మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, 2019 నుండి నేటి వరకు నల్లగొండ డిసిసి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వివాద రహితంగా ఉంటూ రాజకీయ గురువు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ఆశీస్సులతో శంకర్ నాయక్ ముందుకు సాగుతున్నారు.

నాన్ కెనాల్ గ్రామాలకు నీటిని విడుదల చేయాలి

నవతెలంగాణ-కోదాడటౌన్

మునగాల మండల నాన్ కెనాల్ గ్రామాలకు నీటి విడుదల చేయాల సూర్యాపేట జిల్లాలోని మోతె మండలం,మునగాల మండల పరిధిలోని నాన్ కెనాల్ ఆయకట్టు గ్రామాలకు వెంటనే ఎస్సారెస్పీ జలాలను విడుదలకు రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి చొరవ తీసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సోమపంగు శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.మోతె మండలంలోని అన్ని గ్రామాల, మునగాల మండల పరిధిలోని నాన్ కెనాల్ ఆయకట్టు గ్రామాలైన రేపాల,నర్సింహులగూడెం, జగన్నాథపురం, విజయరాఘవా పురం,సీతానగరం,కలకోవ రైతులు ఎస్సారెస్పీ జలాలపై ఆధారపడి యాసంగి సీజన్లో అధిక మొత్తంలో వరి సాగు చేశారని,ఇప్పుడు నీళ్ల లేక చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ ప్రాంతాలకు నీటి విడుదల చేసి నాన్ కెనాల్ ఆయకట్టు రైతులను ఆదుకోవాలన్నారు.

ఆర్యవైశ్య జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఉమా మహేశ్వరి

నవతెలంగాణ-కోదాడటౌన్

ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా కోదాడ పట్టణానికి చెందిన గరిణే ఉమామహేశ్వరి ఏకగ్రీవంగా నియమితులైనట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పైడిమర్రి నారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకం ఉంచి తనకు అప్పగించిన పదవికి పూర్తి న్యాయం చేస్తానని, మహాసభ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా తెలియజేస్తూ జిల్లాలోని ఆర్యవైశ్య మహిళల ఐక్యతకు కృషి చేస్తానని ఉమామహేశ్వరి తెలిపారు. ఆమె ఎన్నికపై జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి రమేష్, గరిణే శ్రీధర్ ,వంగవీటి శ్రీనివాసరావు, పబ్బిశెట్టి సతీష్, దివ్వెల రామారావు, గుడు గుంట్ల శ్రీనివాసరావు, తవిడిషెట్టి నాగేశ్వరరావు, ఓరుగంటి పాండు యాద సుధాకర్, వైశ్య యువజన సంఘ నాయకులు యిమ్మడి అనంత చక్రవర్తి, డాక్టర్ వంగవీటి భరత్ చంద్ర, ఓరుగంటి నిఖిల్ ,బెలిదే భరత్, వంగవీటి శరత్చంద్ర, ఆవోప కార్యవర్గం, వాసవి క్లబ్స్ బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

నవతెలంగాణ-చింతలపాలెం

చింతలపాలెం మండల కేంద్రంలో ముస్లిం బజార్ నందు లో వోల్టేజ్ సమస్యతో బాధపడుతున్నామని కరెంటు డిపార్ట్మెంట్ వారికి విన్నవించగా వారు ఆదివారం 100 కేవీ ట్రాన్స్ ఫార్మర్ శాంక్షన్ చేపించి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కరెంట్ లైన్మెన్ వీరబాబు, జూనియర్ లైన్మెన్ శీను, కరెంటు డిపార్ట్మెంట్ వారికి శాలవతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ నీటి సంఘం చైర్మన్ పంతుల్ జానీ, యాకుబ్ అలీ, ఇస్మాయిల్, షబీల్, మహమ్మద్ రఫీ, జిలాని, వహీద్, మదర్ సాబ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భాషా పండితుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కోదాడటౌన్

రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ భాషా పండితుల ఆత్మీయ రజతోత్సవ సమావేశం సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కోదాడ పట్టణంలోని బాలుర హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు ఎండి అబ్దుల్లా పాల్గొని మాట్లాడారు. 2005/1 యాక్ట్ ను రద్దు చేయించి సీనియారిటీ వచ్చే విధంగా గా మరియు సర్వీస్ రూల్స్‌ను మార్చి ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా డిప్యూటీ డిఈవోలుగా ప్రమోషన్లు వచ్చే విధంగా కృషి చేస్తామని అదేవిధంగా మిగిలిపోయిన భాషా పండితులకు అప్ గ్రేడ్ చేయించి పదోన్నతులు ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సూర్యాపేట జిల్లా అధ్యక్షులు గుంటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి నాగుల బిక్షపతి, లక్ష్మీనారాయణ, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు బషీర్, సీతారామ శర్మ, పద్మావతి, ఫాతిమా, మోతిలాల్, రాములు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు రవీంద్ర, ప్రధాన కార్యదర్శి కొంపెల్లి శ్రీనివాసరావు, కృష్ణవేణి, చిన్నప్ప, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుజ్జలో రెండు రోజుల శిక్షణా తరగతులు

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

ప్రజా కళలకు మరింత పదును పెట్టేందుకు మండలంలోని గుజ్జ గ్రామంలో రెండు రోజులపాటు నిర్వహించిన ప్రజానాట్యమండలి జిల్లా స్థాయి శిక్షణాశిబిరాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామ చౌరస్తాలో గొర్రెలు తిరగబడతాయనే వీధి నాటకాన్ని కళారూపాల ద్వారా ప్రదర్శించారు.ఈ సందర్భంగా పీఎన్ఎం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంటెపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు మాట్లాడారు. ప్రతిభావంతులైన 15 మంది కళాకారులను గుర్తించి రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చామన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టే పోరుయాత్రలో పీఎన్ఎం కళాకారులు 7 మండలాల్లో 32 గ్రామాల్లో కళాప్రదర్శనలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఓటర్లను గొర్రెలుగా భావిస్తున్న పెట్టుబడి రాజకీయదారులకు బుద్ధి చెప్పేందుకే గొర్రెలు తిరగబడతాయనే వీధి నాటకాలు ప్రదర్శిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పీఎన్ఎం జిల్లా కమిటీ సభ్యులు భిక్షపతి, శ్రీకృష్ణ,ఉదయ్, నరసమ్మ,సంపత్, నరేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
సోమవారం | మార్చి 10, 2025 | www.navatelangana.com

'హామీలు ఫుల్... ఆచరణ నిల్'

నవతెలంగాణ-హాలియా

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆరు గ్యారంటీలతో పాటు అనేక వాగ్దానాలు చేసి నేడు పూర్తిగా నేడు ఆచరణ నిల్లుగా ఉందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అవుతా సైదులు ఆవేదన వ్యక్తపరిచారు. హాలియాలో సాయి ప్రతాప్ నగర్‌లో సీపీఐ(ఎం) పోరుబాట సర్వేలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఆర్గారంటీలో ఇచ్చిన హామీల అమలులో ప్రజలని అడిగి



తెలుసుకున్నారు. పాలకులు మారిన వారి పాలనా విధానం మారలేదని కొత్త సీసాలో పాత సార మాదిరిగానే ఉందన్నారు. పేదలకు ఇందిర మ్మెండ్లు మహిళలకు 2500 పెన్షన్ 4000 తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రేవెల్ వెంకటేశ్వర్లు వదిన వెంకన్న నాయకులు కాట్న వెంకటయ్య సంజీవ తదితరులున్నారు.

డాక్టర్ సౌజన్యకు సన్మానం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని భజరంగ్ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ సౌజన్య ని శాలువాతో ఘనంగా సన్మానించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌజన్య మాట్లాడుతూఎక్కడైతే స్త్రీలు పూజింపబడుతారో



అక్కడ సమాజం గొప్పగా అభివృద్ధి చెందు తుంద న్నారు. మహిళలను గౌరవి ంచడం అంటే మన తల్లులను మనం సన్మానించుకోవడమన్నారు.

రాజకీయ భిక్ష పెట్టిన వారిని తిడితే సహించం

- మాజీ ఎమ్మెల్యే గాదరి తీసుకొచ్చిన పనులే పూర్తి చేయించలేని ఎమ్మెల్యే సామేలు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి

నవతెలంగాణ-మోత్కూర్

ఆగమేగాల మీద చైర్మెన్లను తప్పించి ఏడాదికాలంలో మోత్కూర్‌ను ఏం అభివృద్ధి చేస్తావో చేసి చూపించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలును బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు ఆదివారం మోత్కూర్ మండలం దత్తప్ప గూడెం గ్రామంలోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.కేసీఆర్ హయాంలో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నుండి వచ్చిన నీళ్లకు ఎమ్మెల్యే సామేల్ పూలు జల్లి పూజలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో దోసెడు ఇసుక తీయనియ్యను అని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి నేడు వంగమర్తి నుండి వందలాది లారీల్లో ఇసుక తరలిపోతున్న కిమ్మనకుండా ఎలా ఉండిపోతున్నావని ఎమ్మెల్యేను రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. మోత్కూరులో 40 ఫీట్ల వెడల్పుతో రోడ్డు ఎక్కడ ఉందో చూపిస్తారా అని సవాల్ విసిరారు. తమకు నచ్చిన నాయకుల వద్ద 30 ఫీట్లు... సామాన్య ప్రజానీకం ఇంటిముందు 40 ఫీట్లు రోడ్డు వెడల్పు చేయించారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ హయాంలో ప్రారంభించిన మున్సిపల్ కార్యాలయం పూర్తి చేయించే సోయి ఎమ్మెల్యేకు లేదని విమర్శించారు. గాదరి కిషోర్ కుమార్ హయాంలో మోత్కూరు మండల విలేకరులకు ఇండ్ల స్థలాలు ఇస్తే వాటిని అప్పగించడానికి



సామేలు సొమ్మేమి పోయిందని ప్రశ్నించారు. జీత, భత్యాలు లేకుండా విధులు నిర్వహించే విలేకర్లకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే మీతో పాటు మేమందరం కూడా సంతోషిస్తామన్నారు.తక్షణమే విలేకర్ల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ కల్పించిన రిజర్వేషన్ల వల్లనే ప్రస్తుత మోత్కూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ నూనె ముంతల విమల వెంకటేశ్వర్లు చైర్మెన్ అయ్యారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎమ్మెల్యే సామేల్ నోటికి ఎంత మాట వస్తే అంత మాట అంటున్నాడని, రాజకీయ భిక్ష పెట్టిన కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, జగదీశ్‌రెడ్డిలను తిడితే సహించేది లేదని హెచ్చరించారు. దండాలు, దస్కాలు పెడితే గిడ్డంగుల చైర్మెన్ పదవి వచ్చిందన్న విషయాన్ని మరిచిపోవద్దని చురక అంటించారు. హరీష్‌రావు నీ కొడుకు పెండ్లికి ఎంత సహాయం చేసిండో మా అందరికీ తెలుసన్నారు.తల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీని, అన్ని రకాలుగా సహకరించిన నాయకులను దూషిస్తుంటే తనకు బాధ కలుగుతుందన్నారు. గిడ్డంగుల చైర్మెన్ పదవి ఇవ్వకపోతే అసలు నీ స్థానం ఎక్కడో నువ్వే ఊహించుకోవాలని ఎమ్మెల్యేను ఉద్దేశించి పేర్కొన్నారు. ఎమ్మెల్యే అయ్యాక అధికారుల మీద జులుం చేస్తున్నారని ఆరోపించారు.తాను నిజాలు మాట్లాడుతుంటే దళిత ఎమ్మెల్యేపై అగ్రవర్ణాలు అక్కసు వెళ్లగక్కుతున్నారంటున్నారని తనను తానే విమర్శించుకున్నారు.తమ పార్టీకి చెందిన మోత్కూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రమ్మను పదవి నుండి దించివేసి ఏం సాధించావో చెప్పాలని డిమాండ్ చేశారు.మానాయకుంట-జానకిపురం రోడ్డును తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల నుండి 20శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కార్యాలయం ముందు కాంట్రాక్టర్లు నిరసనకు దిగడమే కాంగ్రెస్ పాలనకు నిదర్శనమని అన్నారు. 10 కోట్లతో నియోజకవర్గంలో సీసీరోడ్లు వేయించాలన్నారు.పీఏసీఎస్ చైర్మెన్‌గా తాను, తన కుమారుడు అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు చేసి నేటికీ తాము చేసిన అవినీతి ఏమిటో నిరూపించలేకపోయారని తెలిపారు.కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసేదాకా తాను విశ్రమించానని చెప్పి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో బీఆర్ఎస్ మోత్కూరు, అడ్డగూడూరు మండలాల అధ్యక్షులు పొన్నబోయిన రమేష్, కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, మోత్కూరు పట్టణ అధ్యక్షులు జంగ శ్రీను, ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేశం, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు దాసరి తిరుమలేష్, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మెన్లు కొనతం యాకూబ్‌రెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, నాయకులు డాక్టర్ కోక భిక్షం, రాంపాక నాగయ్య, సామ పద్మా రెడ్డి, కొండా సోమమల్లు, అన్నందాస్ విధ్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి క్వింటాల్ రూ.25వేలకు కొనుగోలు చేయాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేశ్

నవతెలంగాణ-హాలియా

అనుముల మండలం ముక్కముల గ్రామంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మల్లం మహేష్ డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిర్చి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిర్చిని ఆహారపంటగా గుర్తించి మద్దతు ధరల జాబితాలో చేర్చాలని పంటలు, ఎరువులు, పురుగుమందులపై జీఎస్టీ రద్దు చేయాలని అన్నారు. ప్రధాని మోడీకి వ్యవసాయ రంగం గురించి పట్టడం లేదని క్వింటాల్ మిర్చికి రూ.25వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిర్చిని వ్యాపార పంటగా కాకుండా ఆహారపంటగా గుర్తించాలి మార్క్‌ఫెడ్, నాఫెడ్‌ల ద్వారా రూ.25వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 2023లో క్వింటా మిర్చి రూ.25,500 పలుకగా ఇప్పుడు కేవలం రూ.10వేల నుంచి 11వేలకే కొనుగోలు చేస్తుండటంపై మండిపడ్డారు. రాష్ట్రంలో సుమారు ఐదు లక్షల ఎకరాల్లో మిర్చి సాగైందని, రాష్ట్రంలో ఈ ఏడాది 447 మంది రైతులు చనిపోయారని, ఇంతమంది రైతులు చనిపోతున్నా మిర్చి ధరలపై రాష్ట్రప్రభుత్వం కేంద్రంతో ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. గతంలో వామపక్షాల భాగస్వామ్యంతో పనిచేసిన యూపీఏ ప్రభుత్వం మిర్చికి 10శాతం కంటే ధర తగ్గినప్పుడు గిట్టుబాటు ధర కోసం చర్యలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అమెరికా పర్యటనలో రూ.500 కోట్ల డాలర్ల ఆయుధ హెలికాప్టర్ల కొనుగోళ్లపై ఆ దేశాధ్యక్షుడు ట్రంప్‌తో ఒప్పందం చేసుకున్న మోడీ అమెరికా, చైనా, థాయ్‌లాండ్ తదితర దేశాలకు ఎక్కువగా ఎగుమతి అయ్యే తేజా, అర్మూర్ రకం మిర్చి గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మిర్చి రైతులు పురుగుమందులపై రూ.50వేల పెట్టుబడి పెడితే 18శాతం జీఎస్టీ పేరుతో రూ.9వేలు పన్ను కట్టాల్సి వస్తోందని వివరించారు. ఎరువులపై 10-30శాతం పన్నులు, డీజిల్, పెట్రోల్‌పై కమీషన్లు దండుకుంటున్న కేంద్రప్రభుత్వం మిర్చి పంట ధరను 60 శాతం తగ్గించటంపై



ఆగ్రహం వ్యక్తం చేశారు. పురుగుమందులపై రూ.లక్ష పెట్టుబడికి జీఎస్టీ కేంద్రానికి రూ.18వేలు చెల్లిస్తున్నామని తెలిపారు. మిర్చి ధర రూ.15వేలకు తగ్గకుండా చూస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మిర్చి బోర్డు ఏర్పాటుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. సుగుంధద్రవ్యాల బోర్డు నుంచి విడదీసి మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు పెద్దగోని అనిల్,గిరి సైదులు, పెద్ది శివ, అంజయ్య రైతులు వెంకటరెడ్డి కూలీలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) పోరుబాటను జయప్రదం చేయండి

నవతెలంగాణ-మోత్కూర్

గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించే పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆ పార్టీ మండల, టౌన్ కమిటీల సమావేశం మండల కమిటీ సభ్యులు కురిమేటి యాదయ్య అధ్యక్షతన నిర్వహించారు.ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలలో ముఖ్యంగా రేషన్ కార్డులు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, మురికి కాల్వల నిర్మాణం లాంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 23,24,25వ తేదీలలో గ్రామీణ నిరసనలు, 28 న మండల తహసీల్దార్ కార్యాలయం ముందు అన్ని గ్రామాల ప్రజలను సమీకరించి ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, పట్టణ కార్యదర్శి రాచకొండ రాములమ్మ, సీఐటీయూ నాయకులు కూరేళ్ళ నర్సింహా, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కురుమేటి యాదయ్య, మెతుకు అంజయ్య, సహారా, కందుకూరి నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయడం కోసమే టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-చౌటుప్పల్

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం కోసం టాలెంట్‌టెస్ట్ ఉపయోగపడుతుందని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు దాసరి ప్రకాశ్, తీగుళ్ల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పట్టణకేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్‌టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు టాలెంట్‌టెస్ట్ ప్రశ్నాపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మానసిక ఒత్తిడి లేకుండా పదో తరగతి పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. టెస్టుకు 300 మంది పదో తరగతి విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల ఉపాధ్యక్షులు రుద్రగోని మధు, దోనూరి శ్రావణ్, గర్ల్స్ కమిటీ నాయకురాళ్లు దివ్య, ప్రవళిక, ప్రసన్న, నాయకులు వరుణ్, సాగర్, వెంకట్, నవీన్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-మోత్కూర్

మోత్కూరు మండలంలోని పొడిచేడు గ్రామానికి చెందిన జిట్ట వెంకటయ్య(68) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా మృతదేహానికి పేలపూడి చౌదరి బ్రదర్స్.పూలమాలలేసి నివాళులర్పించారు.ఆర్థికసాయంగా రూ.5వేలు అందించారు.ఈ కార్యక్రమంలో పేలపూడి సత్యనారాయణ చౌదరి, సింగిల్ విండో చైర్మెన్ పేలపూడి వెంకటేశ్వర్లు,మాజీ సర్పంచ్ పేలపూడి మధు,కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జిట్ట అంజయ్య,నాయకులు, దీటి సందీప్,సింగిల్ విండో డైరెక్టర్ జిట్ట లక్ష్మయ్య,కొప్పు మల్లేష్,దేందే మల్లేష్,యాదగిరి,జిట్ట అంజయ్య, తొంట మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత

నవతెలంగాణ-బొమ్మలరామారం

మండలంలోని పిల్లిగుండ్లతండా గ్రామానికి చెందిన జేతిరాం కూతురు వివాహానికి నాగార్జున పాల డెయిరీ ఆధ్వర్యంలో రూ.5వేల చెక్కును సెంటర్ ఏజె సూపర్‌వైజర్ చెరుకుపల్లి విద్యాసాగర్‌రెడ్డి చెక్కును ఆదివారం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు నాగార్జున పాలడెయిరీ అందుబాటులో ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కర్నాకర్,లింగ,బాల్‌సింగ్, నర్సింహ,లింగానాయక్ ,నరేందర్, మీత్య తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్‌లో ప్రారంభమైన సీపీఐ(ఎం) పోరుబాట



నవతెలంగాణ-నకిరేకల్

ప్రజాసమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డ ఐదవ వార్డులో సీపీఐ(ఎం)పోరుబాట యాత్రను ఆ పార్టీ మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చీమలగడ్డ ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు లేక మురికినీరు కాలనీ ముందు నిలవడంతో ఆ ప్రాంతంలో దోమలు, ఈగలు వృద్ధి చెంది పందుల స్వైరవిహారం ఎక్కువైందన్నారు. దీంతో అక్కడి ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు లేక దహన సంస్కారాలు అనంతరం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. స్మశాన వాటికలో బోర్ వేయించి స్నానాల గదులు నిర్మించాలన్నారు.ఎస్సీ కాలనీలో ఒకే ఇంటిలో ఇద్దరు ముగ్గురు అన్నదమ్ములు నివాసం ఉంటున్నారని,అట్టి కుటుంబాలకు ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఇదే కాలనీలో ఇంటి పైభాగం నుండి కరెంటు తీగలు ఉన్నాయని, గాలి దుమారం వచ్చిన సమయంలో తీగలు ఒకదానికొకటి రాసుకుని మెరుపులు ఇండ్లపై పడడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు.వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి వంటెపాక వెంకటేశ్వర్లు, నాయకులు వంటెపాకకృష్ణ, ఏర్పుల రాజేశ్వర్,వంటేపాక నాగార్జున, మర్రి వెంకటయ్య, వంటెపాక జమదగ్ని, వంటెపాక రేణుక, వంటెపాక శ్రావణి, బుడిగె సైదమ్మ పాల్గొన్నారు.

మహిళలు సంఘటితంగా ఉండి హక్కుల కోసం ఉద్యమించాలి

నవతెలంగాణ-నకిరేకల్

మహిళలు సంఘటితంగా ఉండి తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు చెన్నబోయిన నాగమణి పిలుపునిచ్చారు.ఆదివారం పట్టణంలోని పన్నాలగూడెంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పన్నాల శశికళ అధ్యక్షతన మహిళలు గౌరవంగా జీవించడం తమ హక్కు అంశంపై సదస్సు నిర్వహించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు మహిళల కోసం ఎన్నో వాగ్దానాలు చేసిందన్నారు. అధికారంలోకొచ్చి ఏడాది గడుస్తున్నా నేటికీ వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ



వెంకట్ గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ సుంకి మణెమ్మ, పట్టణ కార్యదర్శి ఆర్.ఇందిరా, ప్రతినిధులు రేణుక, రామంజమ్మ, సైదమ్మ, మంజుల, రజియా బేగం, నరసమ్మ పాల్గొన్నారు.

యువజన రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో అధికనిధులు కేటాయించాలి

నవతెలంగాణ-చౌటుప్పల్

యువజన రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లె మధుకృష్ణ, గడ్డం వెంకటేశ్ డిమాండ్‌చేశారు. ఆదివారం పట్టణకేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో గుడ్డేటి సుర్జీత్ అధ్యక్షతన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో రంగారెడ్డి జిల్లా వేదికగా యూత్ డిక్లరేషన్ ప్రకారం యువజన రంగానికి అన్ని రకాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారన్నారు. ఇప్పటి వరకు డిక్లరేషన్‌లో ఉన్న ఏ ఒక్క అంశాన్ని కూడా అమలుచేసిన పరిస్థితి కనబడడం లేదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. నూతన పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. యువతకు క్రీడా రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించడం వల్ల నిరుద్యోగ శాతాన్ని తగ్గించి, ఉపాధి కల్పనకు తోడ్పడుతుందని సూచించారు. జిల్లాలోని శాసనసభ్యులు యువజన రంగంపై ప్రత్యేక దృష్టిసారించి, యువజన రంగానికి అధిక నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్‌డి.ఖయ్యుమ్, ఎమ్‌డి.సలీమ్, సహాయకార్యదర్శి కవిడె సురేశ్, జిల్లా కమిటీ సభ్యులు బోదాసు నరేశ్, సుర్వి కిరణ్, ఆకుల రాజు, మంద కిరణ్‌కుమార్, షేక్ రియాజ్ పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నాంపల్లి

కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి, ఫినిక్స్ ఫౌండేషన్ వారు సంయుక్తంగా కలిసి నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కంటి పరీక్షల కోసం మండలంలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎవరు కంటి సమస్యతో బాధపడకూడదు అని కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మండలంలో కంటి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకున్న అనంతరం అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని, చిన్న చిన్న కంటి సమస్యలు ఉన్నవారికి మందులు, కంటి అద్దాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 1400 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని, 110 మందికి కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని వెంటనే బస్సులు ఏర్పాటు చేసి ఆపరేషన్



కోసం హైదరాబాద్‌కు పంపించడం జరిగిందని, సోమవారం మరొక 110 మందిని మంగళవారం మరకు 110 మందిని ఆపరేషన్ కోసం హైదరాబాద్ కు పంపించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి మాజీ జెడ్పిటిసి ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కుంభం కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు ఏరెడ్ల రఘుపతి రెడ్డి, పూల వెంకటయ్య, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సయ్యద్ గఫార్, పెద్దిరెడ్డి సంజీవరెడ్డి (రాజు), శీలం జగన్మోహన్ రెడ్డి, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు కలకొండ దుర్గయ్య అంగిరేకుల పాండు, దామెర యాదగిరి, సురేందర్, ఏరెడ్ల నారాయణరెడ్డి, మెగావత్ రవి నాయక్, గజ్జల శివారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు నాంపల్లి మాజీ ఉపసర్పంచ్ ఎస్.కె అస్రాభి చాంద్ పాషా, బిరుదోజు యాదమ్మ, సబ్బి అరుణ, సందీప్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నేతాల కొండల్, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొనగా ఈ వైద్య శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ. నవీన్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ ఎం. శోభన్ బాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మెటీరియల్ డబ్బులను రైతుల అకౌంట్లోకి వేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

ఉపాధి హామీ నిధుల నుండి పేద రైతులకు పండ్ల తోటల అభివృద్ధి కొరకు ఈజీఎస్ నిధుల నుండి వచ్చే నిధులను మెటీరియల్ పేమెంట్‌లను గ్రామపంచాయతీ అకౌంటులకు కాకుండా రైతుల పర్సనల్ అకౌంట్‌లోకి డబ్బులు జమ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనందు అన్నారు. ఆదివారం పీఏ పల్లి మండలంలోని వద్దిపట్ల ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలోని పడమటి తండా పుట్టంగండి తండా తదితర గ్రామాల్లో



సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 8 మంది రైతులకు సంబంధించినటువంటి పండ్ల తోటల సాగు డబ్బులు ఆరు నెలలకు ఒకసారి మెటీరియల్ పేమెంటు ఇవ్వడం జరుగుతుందని ఒక్కొక్కరికి 11,000, 5,000, 8,000 రూపాయల చొప్పున దాదాపు 8 మంది రైతులకు 52,000 వచ్చినవని అన్నారు. ఈమధ్య రైతుల పర్సనల్ అకౌంట్‌లోకి కాకుండా గ్రామపంచాయతీ అకౌంట్లోకి డబ్బులు జమ చేయడం ద్వారా గ్రామపంచాయతీ తీసుకున్నటువంటి ట్రాక్టర్ లోన్ కి ఈఎంఐ డబ్బులు కట్టవుతున్నాయి అన్నారు. దీంతో రైతులకు నష్టం జరుగుతుందని వెంటనే ప్రభుత్వం ఉపాదా హామీ కింద సాగు చేసినటువంటి పండ్లతోటల డబ్బులను నేరుగా రైతుల పర్సనల్ అకౌంట్లోకి నిధులను జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య, ఎం. చందు నాయక్, తదితర రైతులు పాల్గొన్నారు.

కాలువ ద్వారా నీళ్లు వదిలి రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-ఆత్మకూర్ ఎస్

కాలువల ద్వారా నీళ్లు వదిలి రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దండా వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బెల్లంకొండ చక్రయ్య అధ్యక్షతన జరిగిన మండల కమిటీ



సమావేశంలో పాల్గొని వారు మాట్లాడుతూ.. ఎన్నో ఆశలతో ఆకాంక్షలతో యాసంగి వరి పంటను సాగుచేసిన రైతులను ఆదుకోవాలని వారు అన్నారు. ఇప్పటికే ఎండిపోయిన వరి పంటకు ఎకరాకు 30 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులను అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మార్చి 26న జరిగే కలెక్టరేట్ ముట్టడికి రైతులందరూ విరివిగా హాజరై మద్దతు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అవిరే అప్పయ్య, మండల కమిటీ సభ్యులు సానబోయిన ఉపేందర్, సోమిరెడ్డి దామోదర్ రెడ్డి, యాతాకుల మల్లయ్య, గుండు లింగయ్య, రాచకొండ సైదులు, ఎరుకల నాగరాజు, మూల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు మేతగా మారుతున్న పంటచేలు

నవతెలంగాణ-పెనపహాడ్

ఆరు కాలం కష్టపడి రైతులు పండించిన పంట చేలు మధ్యలోనే నీరులేక ఎండిపోయి పశువులకు మేతగా మారడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఆదివారం పలువురు రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి చివరి దశలో చేతికందే సమయంలో పంటలు నిట్ట నిలువునా ఎండిపోవడంతో రైతులు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని మనోవేదనలో పడ్డారు. మండలంలోని గాజుల మల్కాపురం న్యూ బంజారా హిల్స్ తండా పెద్ద గార కుంట చిన్న సీతారాం తండా చెట్ల ముకుందాపురం పలు గ్రామాలలో రైతులు ఎకరానికి రూ.30వేల చొప్పున అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ప్రస్తుత పరిస్థితులలో నీరు లేక నిట్ట నిలువన ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శ్రీరామ్ సాగర్ నీళ్ల రాకపోవడంతో భూగర్భ జలాలు ఇంకిపోయి ప్రస్తుత పరిస్థితుల్లో బోర్ల నుండి నీరు రాకపోవడంతో వరి పొట్ట దశలో



ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఏమి తోచక గొర్రెలను మేకలను, గేదెలను, పశువులను మేపుతున్నారు. దూపాడుకు నాగార్జునసాగర్ నీళ్లు వస్తున్నప్పటికీ గాజుల మల్కాపురం మెట్ట ప్రాంతం కావడంతో పైన పేర్కొన్న పలు గ్రామాలకు నీరు అందక ఎండిపోతున్నాయి. వివరాలు తెలిపిన వారిలో రైతులు కొన్న గంటి ప్రభాకర్ రెడ్డి, బర్మావతు రాములు, బానోతు బాజీ లింగ నాయక్, బుజ్జి జానకి ఉన్నారు.

బొజ్జ చంద్రమ్మ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-మోటకొండూరు

మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన మండల ఈనాడు పత్రిక విలేకరి బొజ్జ రమేష్ తల్లి బొజ్జ చెంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను ఉమ్మడి నల్గొండ డీసీసీబీ మాజీ చైర్మెన్, టెస్కాబ్ మాజీ వైస్‌చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి (బీఆర్ఎస్) చంద్రమ్మ దశదిన కర్మలో పాల్గొని చంద్రమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

నవతెలంగాణ-భువనగిరి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని స్నిగ్ధకాలనీ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం కాలనీలో పరిశోధన పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత కాలనీగా ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో రహదారుల్లో ఖాళీ స్థలాల్లో పడేసిన ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను తొలగిస్తున్నట్టు తెలిపారు. కాలనీ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవడంతో పాటు ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా మానివేయాలని సూచించారు. అందులో భాగంగా త్వరలో ప్లాస్టిక్ రహిత బ్యాగులను తయారు చేయించి బ్యాగులను తయారు చేయించి పంపిణీ చేస్తామ న్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రఘుపతి, అధికారి వెల్లంకి పురుషోత్తంరెడ్డి, డైరెక్టర్లు రత్న బాలరాజు, కాలనీసభ్యులు కృష్ణయ్య, రమేష్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని నిర్నెముల గ్రామానికి చెందిన నోముల లక్ష్మమ్మ మృతి చెందారు.గ్రామానికి చెందిన నాయకులు కందిమల్ల గోపాలరెడ్డి లక్ష్మమ్మ భౌతికకాయాన్ని ఆదివారం సందర్శించి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో నోముల యాదగిరి, సుర్వి సతీష్, నోముల నర్సింహా, ముత్యాల శివ, సుర్వినవీన్, నోముల సుదర్శన్, నోముల కృష్ణ, చిప్పలపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.